



15 రూపాయలు ఓ లెక్కేనంటారా?


కిట్టీ పార్టీకి వెళ్ళొస్తే వెళ్ళొచ్చావు గానీ
వాళ్ళు అది కొన్నారట... వీళ్ళు ఇది
కొన్నారట అని సొది మొదలెట్టావనుకో
నాకు తిక్కరేగుద్ది చెప్తున్నా!!


పాలిష్ చేసిన బియ్యంలో
ఏముంటుంది... అందుకే చివర్లో
చెరోముద్ద తౌడు తింటాం!!

అట్టహాసం


చూశారా సగం లావు
తగ్గించేశాం... తొందర్లోనే
మిగతా సగం కూడా తగ్గించేస్తాంలే!!


వావ్... వంకాయ హల్వా
అదిరిందండీ... తియ్య
తియ్యగా... కాస్త కారంగా
కొంచెం వగరుగా...
ఏంది అదిరేది
అసలు చెక్కెర
వెయ్యడమే మర్చిపోయి
చచ్చుంటే...!!
మొగుడు నేర్పిన వంట
COOK TV
వంట-ఓర్పు


ఊ...ఊ...ఆ
ఉ...ఊ...ఉఊ
ఆ...ఉ...
ఏంది ఊఊ...
నేను మాట్లాడ్డం ఆ
అరగంటైంది!!


ఏమంత అందంగా ఉందని
మీ సెక్రటరీకి వెయ్యిరూపాయలు
ఇంక్రిమెంటు వేశారో నాకర్థం కావట్లేదు!!

కంగ్రాట్స్!

హాస్యానందం సంపాదకులు శ్రీరాముగారి కుమార్తె ప్రియాంక- ఫిబ్రవరి నెలలో హైదరాబాద్‌లో 'హామ్‌స్టెక్' సంస్థ నిర్వహించిన ఫ్యాషన్‌షోలో పాల్గొని 'ద బెస్ట్ కన్‌స్ట్రక్షన్' అవార్డ్ అందుకున్నారు. జీవితంలో వెలుగు నీడల సంగమమే మానవ జీవితం అనే కాన్సెప్ట్‌తో రూపొందినవి ఈ డ్రస్ డిజైన్లు. వారికి మా అభినందనలు.-హైదరాబాద్ ప్రతినిధి













స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

మార్చి-2013

Publisher&Editor	:	Ramu.P
Associate Editor	:	Sudharani.P
Cartoon Editor	:	A.V.M
Well Wishers	:	Tanikella Bharani Jayadev Mallik
Full Pillar	:	Bnim
Designing	:	Creative Graphix
Creative Team	:	Tumbali Sivaji T.Chandra Sekhar Rampa Surya Dubey P.V.Narayana Ramsheshu P.Priyatham Mallikarjun.U
Helper	:	Raviteja.S
Address	:	HASYANANDAM, #8-215/4, Near Ramalayam, Po:YERRABALEM Pin 522 503, Mangalagiri Mandal, Guntur dist.
Ph	:	9849630637

email: hasyanandam @yahoo.com

Hyderabad & Telangana Marketing: Charminar News Agency,
1-6-176/1, M.G.Road,
Khandoji Bazar,
Secunderabad-3.
Ph:9346515813

And : Shams News Agency,
Abids, Hyderabad.
Ph:040-30680840/41



హాయ్... సానందంగా...

'నేను చాలా ఓపెన్ టైప్' అనుకునే రామేశం రాత్రంతా క్లబ్‌లో పేకాడి తెల్లారి ఇంటికొచ్చిన అతనిమీద మండి పడింది భార్య కాంతం–"అసలు ఇప్పుడైనా ఎందు కొచ్చారు ఇంటికి?"

"మొహం కడుక్కుని... టిఫిన్ తిని... వేడి వేడి కాఫీ తాగి వెళ్దామనీ..." చెప్పాడు రామేశం.

◆◆◆

మనం ఈ మధ్య 'నేను చాలా ఓపెన్ మైండ్' అనే మాట తరచు వింటున్నాం. అయితే ఈ 'ఓపెన్ మైండ్' వ్యక్తుల 'మైండ్' ఏమిటో మనకు అర్థం కావు!

ఎందుకంటే 'నలుగురి'లో డిఫరెంట్ నేను అనే 'ఎస్టాబ్లిష్ మెంట్' కోసమే ఈ గోలంతా!

ప్రతి సందర్భంలోనూ ఆనందిస్తూ...ఆస్వాదిస్తూనే వాటిల్లో మళ్ళీ వంకల పెడుతుంటారీ 'ఇంటలెక్చువల్స్'!

ఈ మనస్తత్వంతో వాళ్ళూ ఆనందంగా ఉండరు... ఎదుటివాళ్ళను ఆనందంగా ఉంచరు.

అందరికంటే ఒక మెట్టు పైనున్నాము అనే 'భ్రమ' వలన వారు నలుగురిలో కలవలేరు...నలుగురితో ఆనందంగా గడపలేరు. ఒక వింత ప్రపంచంలో విహరిస్తుంటారు.

ఓపెన్‌మైండ్ అంటే ఎదుటివాళ్ళ గురించి మనసులో భావాల్ని స్పష్టంగా చెప్పగలగడం... అయితే ఆ 'మాట' ఎదుటివాళ్ళను బాధించకుండా వుంటే చాలా మంచిది.


మనసులో ఏవీ పెట్టుకోకుండా 'ఓపెన్'గావుందాం! అయితే దానికి కాస్త 'లౌక్యం' జోడిస్తే అందరూ ఆనందంగా ఉండగలుగుతారు.

అందరూ నవ్వుతూ... ఆరోగ్యంగా... ఆనందంగా వుండాలని కోరుకుంటూ...


–రాము.పి
(ఎడిటర్)


Smile in Every Page... Satisfaction in Every Smile











అట్టపోసిని:
నిత్యామీనన్

ఎక్కడ ఏ నవ్వులున్నాయో....

కార్టూన్లు...

మన జనాలు ..హరగోపాల్...



శ్రీతలిశెట్టిరామారావు జయంతి మే20న

తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోక్విల్ అకాడమీ, ముఖికీమీడియా, హాస్యానందం, సంయుక్తంగా నిర్వహిస్తున్న

ఈ పోటీలో కార్టూనిస్ట్ అందరికీ ఆహ్వానం!

నిబంధనలు:

1. కార్టూన్ A4 సైజ్‌లో తప్పనిసరిగ్గా వుండాలి. సబ్జెక్ట్ మీ ఇష్టమే!
2. ఒకరు 4 కార్టూన్లు మాత్రమే పంపాలి.
3. కాప్షన్‌లెస్ కార్టూన్‌లైతే మరీ మంచిది.
4. సెలక్ట్‌కాని కార్టూన్లు తిరిగి పంపగోరువారు తగిన స్టాంపుల కవరు జత పరచాలి.
5. పరిశీలనలో వున్నవి, కాపీ కార్టూన్లు పంపవద్దు.
6. మీ పూర్తి బయోడేటా ఫొటోతో సహా తప్పనిసరిగా జత చేయాలి.

ఈ సందర్భంగా హాస్యానందంలో ప్రచురించిన ది బెస్ట్ కార్టూన్స్ ని పుస్తకంగా విడుదల చేస్తున్నాం!

కార్టూన్లు మాకు చేరడానికి ఆఖరుతేదీ:
20.3.2013

కార్టూన్లు 'హాస్యానందం' చిరునామాకు మాత్రమే పంపవలెను.

ప్రధమ బహుమతి:
రూ.2000/-లు

ద్వితీయ బహుమతి:
రూ.1000/-లు

విశిష్ట బహుమతులు (10):
ఒకొక్కటి రూ.200/-లు

ఇంకా
ఎన్నో ప్రశంసా పత్రాలు...



ఆ టాపిక్! -ఈ కార్టూన్



కార్టూను వ్యాఖ్య రాయడం ఒక కళ.

బాపు, బాబు, పులిచెర్ల, సరసి – వ్యాఖ్యలు మనల్నెంత గానో ఆకట్టుకుంటాయంటే కారణం ఆ వ్యాఖ్యల్లోని మాటల పొందిక, ముఖ్యంగా యాస!

వ్యాఖ్యలు వ్యావహారికంలో వుంటేనే చదవడానికి బాగుంటాయి. హాస్యాన్ని ద్విగుణీకృతం చేస్తాయి.

వ్యాఖ్యల్లో ఇంగ్లీషు పదాలు వాడడంలో తప్పు లేదు. అలా అని ఎబ్బెట్టు పదాలు వాడకూడదు.

మరో ముఖ్యమైన విషయం. వ్యాఖ్య క్లుప్తంగా వుండాలి. కార్టూనులోని క్యారక్టరు మొహంలోని ఎక్స్‌ప్రెషన్‌లూ కలిసిపోవాలి. వ్యాఖ్య నిర్మాణంలో కార్టూనిస్టు కొంత శ్రమపడాలి. ఒకటికి రెండుమార్లు రాసి చూసుకుని ఆ తర్వాత పనికి పూనుకోవాలి.

ఏ వ్యాఖ్య అయినా కొన్ని పదాలమీద ఆధారపడి వుంటుంది. నాకు 'ఎంట్రీ,... 'రొమాంటిక్' (ప్రేమపూరితంగా) పదాలను వాడాలనిపించి, ఈ వ్యాఖ్య ఫ్రేమ్ చేశాను.

"ఏదైనా తెలుగు సినిమా చూసి రాకపోయారా... ఎంట్రీ కాస్త రొమాంటిక్‌గా వుండేదిగా?"

ఐతే తెలుగు సినిమా మీద చాలా కార్టూన్లు వచ్చాయి గనక, పై కాప్షను నచ్చలేదు. అందుకని సబ్జెక్టు మార్చి, ఈ వ్యాఖ్యలో సెటిల్ అయ్యాను!

INDIAN INSTITUTE OF CARTOONISTS

Presents an Exhibition of Cartoons
by
B. V. SATYAMURTY





Inauguration
Sri B. R. Chavali
Asst. General Manager
Central Bank of India, Bangalore

Date & Time
Saturday, 9th March, 2013; 11:00 AM

Venue
Indian Cartoon Gallery
No.1, Midford House, Midford Garden,
Off M.G.Road, Trinity Circle, Bangalore - 560 001

The exhibition will be open to public up to 23rd March, 2013
from 10 a.m. to 6 p.m. except on Sundays

You are cordially invited to the inaugural function

రీ సౌండ్....

శ్రీచంద్రగారి స్పెషల్ సంచిక హాస్యానందం ముఖచిత్రంతోనే అదర గొట్టేసింది. చంద్రగారి కలర్ చిత్రాలు కన్నుల పండుగ చేశాయి. ఆయన కార్టూన్లు బొమ్మలూ అలరించాయి. బ్నింగారి వ్యాసం బాగుంది. విశిష్ట వ్యక్తుల ప్రత్యేక సంచికల రూపకల్పనలో రాముగారు నిజంగా అభినందనీయులు. **-రాగతిపండరి, కార్టూనిస్ట్, విశాఖపట్నం.**

జనవరి హాస్యానందం శ్రీచంద్రగారి ప్రత్యేక సంచిక చాలా బాగా వచ్చింది. ఆయన బొమ్మలు చూస్తుంటే గతంలోకి వెళ్ళిపోయాను. ఆయన బొమ్మలంటే నాకు చిన్నప్పట్నుంచి ప్రాణం. చంద్రగారి బొమ్మ లు వందలకొద్ది కలక్ట్‌చేసి పెట్టుకునేవాణ్ణి. ఆయన బొమ్మల్ని, కార్టూన్లని ఇమిటేట్ చేయలేక పోయాను... కానీ ఆయన అక్షరాల్ని మాత్రం మక్కికి మక్కీగా కాపీ చేసి ఇప్పటికీ ఆ అక్షరాల్ని ఫాలో అవుతుంటాను. జ్యోతిమాసపత్రికలో చంద్రగారితో పనిచేసే అదృష్టం కలిగింది. లే అవుట్ ఎంత శ్రద్ధగా చేయాలో నేర్చుకున్నాను.

కాసిన్ని పేజీల్లో ఆయన గురించి సమగ్రంగా విశేషాలు అందించి నందుకు రాముగారికి కృతజ్ఞతలు.

-లేపాక్షి, కార్టూనిస్ట్, హైదరాబాద్

ఫిబ్రవరి నెల చంద్ర స్పెషల్ హాస్యానందం 'చంద్ర ప్రచంద్రం'గా ఉంది. అక్కడక్కడా అప్పుడ ప్పుడూ వివిధ పుస్తకాల్లో చంద్రగారి కథల బొమ్మ లో, కార్టూన్లో చూడడం అలవాటైనా... వాటిల్లో కొన్నిటిని ఒక్కచోట చూడడం అన్నది చాలా కంటికి ఇంపైనా విషయం. చంద్రగారి గురించిన విశేషాలు బాగున్నై. మీ కృషికి అభినందనలు. ఇంకా మేము ఇలానే మన ప్రముఖుల చాలా మంది హాస్యానందం ప్రత్యేక సంచికలకోసం ఎదురు చూస్తుంటాం...

-పి.వెంకటరామశర్మ, విశాఖపట్నం

ముఖచిత్రంలో'కృతి' అట్టహాసం బాగుంది. ఈ మాసం చంద్ర వెన్నెల కాసాదు.

-వాస్తురామచంద్ర,నెల్లూరు

చంద్ర స్పెషల్ హాస్యానందం చాలా బాగుంది. ముఖ్యంగా కార్టూన్లు పెద్దసైజుల్లో వేయడం పేజీ లకు అందం వచ్చింది. ఆయన గురించి ప్రము ఖుల మాటలు మనసును తాకాయి. అచ్చమైన మన తెలుగు కార్టూనిస్ట్ అయిన చంద్రగారి గురిం చి ప్రచురించిన హాస్యానందంకు మా అభినం దనలు. **- కె.శ్రీహరి, ఖమ్మం**

హాస్యానందం ఫిబ్రవరి సంచిక చాలా బాగుంది. అయితే చంద్రగారి భావాలు అంటూ మధ్య పేజీల్లో ఇచ్చినవి మేము ఇదివరకు రచన పత్రికలో చదివాము. అందుకు మాకు కొత్తగా ఏమి అన్పించలేదు. మీరు విడిగా ఆయన ఇంటర్వ్యూ చేసుంటే మాకు ఇన్స్పిరేషన్‌గా ఉండేది. ఆ విషయంలో మేము కాస్త నిరుత్సాహంకు లోనైనాము.

-ఆర్.చంద్రశేఖర్, తెనాలి

హాస్యానందం చంద్ర స్పెషల్ చాలా బాగుంది. ఆయన కార్టూన్లన్నీ అలరించాయి. ఇలా ప్రముఖుల గురించి సమగ్రంగా అందిస్తున్న హాస్యానందంకు మా ధన్యవాదాలు. చంద్రగారు కథలుకూడా రాస్తారన్న విషయం విని ఆశ్చర్యపోయాము. మరోసారి మీ కృషికి మా అభి నందనలు. **-టి.మనోహర్, రాజమండ్రి**

ముఖచిత్రం మీద మేఘాల్లోంచి నీటిని తోడుకుంటున్న శ్రీ చంద్ర గారి కార్టూన్ సింప్లీ సూపర్బ్! అలాగే ఈ సంచికలో ప్రచురించిన చంద్రగారి ఎన్నో కార్టూన్లు ఆలోచింపజేసాయి. ముఖ్యంగా భవిష్యత్తులో ఊరివేసుకోడానికై చెట్టుకు నీరు పోస్తున్న కార్టూన్ చూసి నవ్వాలో... అయ్యో... అని బాధపడాలో అర్థం కాలేదు. ఒక కార్టూన్ నవ్వించడమే కాదు... ఆలోచింపజేస్తుంది అన్నదానికి ఈ కార్టూనే ఒక ఉదాహరణ.

ఇక ఈ సంచికలో ప్రచురించిన కథ 'తెలివైన నిర్ణయం' బాగుంది. చివరి పంచ్ కథకి హైలెట్. రచయితకి మా అభినందనలు.

-ఎస్.శ్రీరామమూర్తి, కొత్తగూడెం



మల్లిక్ కామెడీ కథలు

ప్రెజెంటేషన్స్

పార్కులో...

"ఇక్కడ కూర్చుందాం మోహన్..." అంది రాధ నడుస్తున్నదల్లా ఆగి.

"వద్దు రాధా! ఇంకాస్త ముందుకెళ్ళి కూర్చుం దాం..." అన్నాడు మోహన్.

"వద్దు... ఇక్కడే బాగుంది! మనం ఇక్కడే కూర్చుందాం..." మోహన్ కాళ్ళమధ్య తన కాలుబెట్టి మెలిపెడ్తూ అంది రాధ.

ఆ దెబ్బకి మోహన్ కింద ధనేల్‌మని పడ్డాడు.

రాధ అతని పక్కన కూర్చుంది.

"ఛీ... నువ్వు చాలా చిలిపి రాధా... కదూ?" అన్నాడు బిక్కమొహం వేసి మోహన్.

"లేకపోతే ఏంటి? నేను చెప్పింది కాదంటే నాకు చిర్రెత్తుకొస్తుంది తెల్సా?" అంది రాధ.

"మా యింట్లో కూడా అంతే! ఎవరైనా నాకె దురు చెప్తే నాకు చిర్రెత్తుకొస్తుంది... హిహి..." హుషారుగా అన్నాడు మోహన్.

రాధ చురుకుగా మోహన్ వంక చూసింది.

"మోహన్... ఓసారి లేచి నిలబడవా?" అడిగింది.

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు మోహన్.

"లేచి నిలబడు... నీకే తెలుస్తుంది."

మోహన్ లేచి నిలబడ్డాడు.

రాధ చటుక్కున అతని రెండుకాళ్ళ మధ్య తన కాలు పెట్టి మెలి తిప్పింది.

మోహన్ బ్యాలెన్స్ తప్పి మళ్ళీ ధమాల్ అని పడిపోయాడు.

"ఏంటిరాధా!... మరీ నిముషానికోసారి ఇలా నీ చిలిపితనం ప్రదర్శిస్తే కష్టమే రాధా..." నవ్వలేక నవ్వుతూ అన్నాడు.

"లేకపోతే ఏంటి?... మీ ఇంటి సంగతులు నాకెందుకు?... నా దగ్గర మాత్రం నాకెదురు చెప్తే చిర్రెత్తుకొస్తుంది తెల్సా?" అంది రాధ మొహం చిట్లిస్తూ.

మోహన్ నవ్వాడు.

"మనం రెండేళ్ళక్రితం మొదటిసారి పార్కుకి వచ్చినప్పుడు నువ్వు అస్సలు మాట్లాడ్లేదు... నేను పది మాటలు మాట్లాడ్తే నువ్వు ఒక్కమాట మాట్లాడావ్... అప్పుడె ఎంత సిగ్గుపడ్డావనీ... హిహి... ఇప్పుడు మాత్రం నీకు నా దగ్గర భలే చనువొచ్చిందిలే... హిహి... కదూ?"

రాధ మోహన్ వంక చురుకుగా చూసింది.

"అంటే నేను ఇప్పుడు కూడా అప్పట్లా వుండాలనా నీ ఉద్దేశం?.. ఏదీ... ఒకసారి లేచి నిలబడు..."

"అబ్బే... ఇప్పుడెందుకులే రాధా... నేనేదో అప్పుడు అలా వుండేదానివి కదా అని ఊర్కే తల్చుకున్నా... అంతేగానీ ఇప్పుడు అలా వుండ మని కాదు. నాకు నువ్వు ఇప్పుడున్నట్టుంటేనే యిష్టం... హి!" అన్నాడు మోహన్ చేతులు దులుపుకుంటూ.

"ఊ... అట్టారా దారికి."

మోహన్ ఓసారి కళ్ళు పెద్దవి చేసి పార్కుగేటు వైపు చూసి ఠక్కున కప్పలా గెంతా డు పక్కన వున్న పొద వెనక్కి.

"ఏంటలా గెంతావ్?.. కొంపతీసి ఇక్కడి కొచ్చేముందు ఏదైనాచైనీస్ రెస్టారెంటుకెళ్ళి కప్పలకూర తిన్నావా ఏంటి?" పొదవైపు ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది రాధ.

"అదేం కాదుగానీ...నువ్వట్టా పొదవైపు చూడకు రాధా... ప్లీజ్! అటెటో చూస్తూ కూర్చో..." పొదవెనక నుండి మోహన్ రిక్వెస్ట్ చేశాడు.

"ఏం?... ఎందుకని?..." అడిగింది రాధ.

"పార్కులోకి మా చుట్టాలాయన ఒకతను ఫ్యామిలీతో రావడం చూశా... అతను నన్ను చూస్తే ఇంకేమైనా వుందా?.." పొదవెనక నుండి జవాబు చెప్పాడు మోహన్.


రాధ బాధగా నెత్తి కొట్టుకుంది.

"నీ మొహం! మనం వచ్చేవారం పెళ్ళి చేస్కోబోతున్నాం... అయినా ఈ భయం నీకెం దుకూ?"

మోహన్ నాలుక కర్చుకుని పొద వెనక నుండి బయటికి వచ్చి రాధ ప్రక్కన కూర్చు న్నాడు.

"అలవాటు ప్రకారం ఎవరైనా తెల్సినవాళ్ళు కనిపిస్తే ఇదివరకట్లా దాక్కున్నా...హి...." అన్నాడు మోహన్ రాధతో.

"అఘోరించలేకపోయావ్ గానీ మన పెళ్ళి తర్వాత కొత్తగా కాపురం పెడ్తాం కదా... మరి మన కొత్త సంసారానికి కావాల్సిన వస్తువులు



కొనడం గురించి ఏమైనా ఆలోచించావా హిహి హిహి అంటూ ఇకిలించడమేనా?"

"అదేంటి... పెళ్ళయిన తర్వాత మీవాళ్ళు చీరా, సారె పెట్టి పంపించరా?..." ఆశ్చర్యంగా మొహం పెట్టాడు మోహన్.

"ఆ... ఆ... అన్నీ పెట్టిపంపిస్తారు నీ మొహానికి" అంటూ రాధ మోహన్ బుగ్గమీద ఓ పోటు పొడిచింది.

మోహన్ బిక్కమొహం వేశాడు.

"లవ్‌మ్యారేజ్ వల్లకట్నం లేదూ పాడూ లేదు. కనీసం సంసారానికి పనికొచ్చే సామాన్లు కూడా పెట్టి పంపరా?" నీరసంగా అన్నాడు.

"ఏంటీ? నీ మొహానికి కట్నం కావాలా?... అసలు ఎవరైనా నిన్ను పెళ్ళి చేస్కోడమే గొప్ప... ఇంకా కట్నం కూడానా? నువ్వే నాకు ఎదురు కట్నం ఇచ్చినా తక్కువే!!" రాధ బాధగా నెత్తి కొట్టుకుంది.

"ఈ పెళ్ళి ఖర్చులకోసమే బోల్డు అప్పులు చేశాను... ఇంక ఇంటికి కావాల్సిన సామాన్లు కొనడానికి ఇంకెంత అప్పు చెయ్యాలిరా భగవంతుడా... వా... వహ్హ..." ఏడుపు లంకించుకున్నాడు మోహన్.

"వాళ్లే ఊర్కో... ఎవరైనా చూస్తే బాగుండదు" అంటూ మోహన్ నెత్తిన ఒక జల్లకాయ్ కొట్టింది రాధ.

"హిహి..." అన్నాడు మోహన్.

"హర్రే.... జల్లకాయ్ కొట్టగానే భలేగా నవ్వావే!!... ఏదీ మరోసారి!"

పఠాళ్ అని రాధ మోహన్‌కి జల్లకాయ్ కొట్టింది.

"హిహ్హి... హిహిహి... హ్హిహ్హిహ్హి" మళ్ళీ నవ్వాడు.

"హర్రే!.... గమ్మత్తుగా వుందే... ఏదీ మరో సారి..." ఫడేల్‌మని కొట్టింది ఈసారి.

మోహన్ ఈసారి నవ్వలేదు... ఆమెవంక చిరుకోపంగా చూశాడు.

"నేనేం నువ్వు జల్లకాయలు కొడ్తుంటే నవ్వడం లేదు... ఇంక జల్లకాయలు కొట్టమాకు" అన్నాడు.

"మరెందుకు నవ్వుతున్నావ్?" అడిగింది రాధ.

"సడెన్‌గా నాకో విషయం గుర్తుకు వచ్చింది. నేనేం ఇంటికి కావాల్సిన సామాన్లు

మొత్తం కొనక్కర్లేదుగా!..." సంబరంగా అన్నాడు మోహన్.

"ఏం?.. ఎందుకు కొనక్కర్లేదు... కొంపదీసి నన్ను పెళ్ళి చేస్కోకూడదని నిర్ణయించుకున్నావా ఏంటి?.. ఏదీ... ఓసారి లే... లేచి నిలబడు" సీరియస్‌గా అందిరాధ.

మోహన్ కిసుక్కున నవ్వాడు.

"నన్నలా అపార్థం చేస్కోకు రాధా! మరేమో నేనలా ఎందుకన్నానంటే... మన పెళ్ళికి చాలా మంది ప్రెజెంటేషన్లు తెచ్చిస్తారుగా!... వాటిల్లో మన ఇంటికి పనికివచ్చేవి చాలా వుంటాయి... లేనివి కొన్ని మాత్రం మనం కొనుక్కుంటాం... హిహి... కదూ?"

"నీకు భలే తెలివితేటలున్నాయే!..." అంటూ రాధ మోహన్ దీప్పమీద సంబరంగా ఠపేల్ మని వాయించింది.

◆ ◆ ◆

వారం రోజుల తర్వాత రాధ, మోహన్‌ల పెళ్ళి జరిగిపోయింది.

పెళ్లికి వచ్చిన చాలామంది చేతిలో ప్రెజెంటేషన్ల ప్యాకెట్లతో వచ్చారు...

పెళ్ళి కాగానే అందరూ వధూవరులకు బెస్ట్‌విషెస్ చెప్పి, వాళ్ళ చేతితో ప్యాకెట్లు పెట్టి భోంచేసి వెళ్ళిపోయారు.


పెళ్ళి హడావిడి తగ్గివచ్చిన స్నేహితులూ, బంధువులూ వెళ్ళిపోయేసరికి రాత్రి పదకొండు గంటలైంది.

రాధ, మోహన్ ఇద్దరూ గదిలోకి చేరారు.

మోహన్ క్రాపు రివ్వున ఎగిరి మళ్ళీ నొసలు మీద పడింది.

"హబ్బా!... గాలి చాలా ఎక్కువగా వీస్తున్నట్టుంది... కిటికీ తలుపులు వేసేద్దామా?..." రాధని అడిగాడు మోహన్.

"నీ మొహం...అది బయటినుండి వచ్చిన గాలికాదు... నిద్దరొస్తుంటే నేను ఆవులించా... హిహి!... మనం ఇహ నిద్దరోదామా?" అంది



రాధ కళ్ళు మిటకరిస్తూ.

"అప్పుడేనా?... మనకి ఏమేం ప్రజెంటేషన్లు వచ్చాయో చూస్కోవద్దూ?" అన్నాడు మోహన్ గదిమూల కుప్పగా పడివున్న ప్రజెంటేషన్ల ప్యాకెట్ల వంక చూస్తూ.

"హావును కదూ?... ఆ విషయమే మర్చిపోయా" హుషారుగా అంది రాధ.

ఇద్దరూ ప్రజెంటేషన్లమీద ఎగబడ్డారు.

మొట్టమొదటి ప్యాకెట్ మోహన్ విప్పాడు.

అందులోంచి ఒక టేబుల్ లైట్ బయట పడింది.

"టేబుల్‌లైట్!... బాగుంది కదూ?... హి హి!!..." దానివంక సంతోషంగా చూస్తూ అన్నాడు మోహన్.

"ఇప్పుడు ఈ ప్యాకెట్ నేను విప్పుతా..." అంది రాధ సంబరంగా రెండో ప్యాకెట్ చేతిలోకి తీస్కుంటూ.

"ఊ... ఊ...విప్పు." హుషారుగా అన్నాడు మోహన్.

రాధ ఆ ప్యాకెట్ విప్పదీసింది.

అందులో కూడా టేబుల్ లైటే!

"హార్నీ... గమ్మత్తుగా వుందే! ఇందులో కూడా టేబుల్ లైట్ వుంది!! హిహి..." అంది రాధ.

తర్వాత ఇంకో ప్యాకెట్ విప్పారు.

అందులో కూడా టేబుల్‌లైటే! ఇంకో ప్యాకెట్‌లో చెక్కముక్కమీద కడవ చంకలో పెట్టుకున్న బొమ్మ!

ప్యాకెట్లు విప్పుతున్న కొద్దీ ఇద్దరికీ బి.పి. పెరిగిపోసాగింది.

పెళ్ళంటే ఏదో ఒక ప్రెజెంటేషన్ తీస్కెళ్ళి వాళ్ళ మొహాన కొట్టాలా... అలా పనికిరానివి ఇచ్చేకంటే ఏమీ ఇవ్వకుండా వుంటే నయం కదా...


విసుక్కుంటూ, తిట్టుకుంటూ ప్యాకెట్లన్నీ విప్పారు రాధ, మోహన్‌లు.


వాటిల్లోంచి బయటపడినవి ఇవి.


పధ్నాలుగు టేబుల్ లైట్లూ, ఇరవై చెక్కమీద పెయింట్ చేసిన సీనరీలూ, ఐదు కప్పుసాసరు సెట్లూ, పదిహేను ఫోటో ఆల్బంలూ, ఆరు ఫోటోఫ్రేములూ వగైరా... వగైరా.....!


వాటిని చూస్తూనే మోహన్, రాధలు నీరసంగా మంచంమీద వాలిపోయారు.

మనిషికి మర










శివ...శివా!
రాగతి పండరి
మీరు బాకీ ఈవాళ తీర్చక పోతే ఊరుకునేది లేదని నిన్న ఆయన్ని బెదిరించి వెళ్లారుగా - రాత్రంతా నిద్ర పట్టక ఎంచక్కా శివరాత్రి జాగరం చేసేశారు అన్నయ్యగారూ!
రాగతి పండరి
నువ్వు కొనుక్కున్న పట్టుచీర పక్కింటావిడకి చూపించలేదేం?
ఈవాళ వద్దు - శివరాత్రిగా చూసిందంటే నిద్రపోదు జాగరం ఈజీగా చేసేస్తాది.....
రాగతి పండరి
ఆయన నిద్ర ఆపుకోవటం అంటే పిచ్చెక్కిపోతారమ్మా..... ఈవాళ శివరాత్రి జాగరం చేస్తున్నారుగా.....
రాగతి పండరి
దేవుడి సినిమా చూస్తుంటే నిద్రొస్తుంది నాకే ఇంకో ఛానల్లో దెయ్యం సినిమా వస్తే పెట్టండి.... భయంతో నిద్ర రాదు - శివరాత్రి జాగరం చేసెయ్యొచ్చు!!
రాగతి పండరి



కథ

చిదానందం చిల్లర చిక్కులు

మల్లారెడ్డి మురళీమోహన్



అత్యవసరమైన పనిమీద ఉన్నపళంగా బ్రాంచ్ ఆఫీస్‌కి వెళ్ళాలని పురమాయించిన ఆఫీసర్‌మీద రుసరుసలాడుతూ, ఆ క్యాంప్ కాస్తా వైజాగ్‌కే కావడం వల్ల లోలోపల కొంచెం ఆనందిస్తూ ఆఫీసునుండి ఇంటికి బయల్దేరాడు చిదానందం.

ఆదరా బాదరాగా రెండు జతల బట్టలు బ్యాగ్‌లో కుక్కి, రిజర్వేషన్ ఎలానూ దొరకదు కదాని బస్సుకి వెళ్ళడానికి ధైర్యం కూడగట్టు కుని బస్టాండుకి వెళ్ళాడు.

టికెట్ కొనేందుకు క్యూలో నిల్చుని జేబులు తడుముకున్నాక గానీ పర్సులో డబ్బుల్లేని సంగతి గుర్తుకు రాలేదతనికి.

స్వతహాగా చిదానందం అతి జాగ్రత్తపరుడు... భయస్తుడు.... ఆపైన ఇలాంటి అత్యవసర సమయాల్లో కాస్త వత్తిడికి లోనై మతిమరుపుని కూడా కొనితెచ్చుకుంటూంటాడు.

నిజానికి వైజాగ్ ప్రయాణం కాబట్టి చుట్టాల్ని, స్నేహితుల్ని కలుసుకోవచ్చనే ఆనందం ఒక పక్క, రిజర్వేషన్ లేని హఠాత్ప్రయాణం వల్ల భయం మరోపక్క కల గాపులగమై అతని గాభరాకి కారణాల య్యాయి.

బస్టాండ్ ఆవరణలో 'ఏటీయమ్'కి వెళ్ళి కార్డు పెట్టి టకటకా బటన్లు నొక్కాడు.

సర్రున వెయ్యి రూపాయల నోట్లు దూసు కొచ్చాయి. దాదస్తపరుడైన చిదానందానికి ఆ రోజు ఉదయమే పేపర్లో చదివిన 'నకిలీ నోట్ల' వార్త గుర్తుకొచ్చి కంగారు మరింత ఎక్కువైంది.

ఈ వెయ్యి రూపాయల నోట్లు వీలయినంత తొందర్లో చిల్లరగా మార్చు కుంటేనే గానీ మనశ్శాంతి దక్కదని భావించి 'క్యూ' వైపు నడిచాడు.

బస్‌టికెట్ కొనడానికి ఒక వెయ్యి నోటు మార్చాడు. కొంత చిల్లరవ్వడంతో 'హమ్మయ్య' అనుకున్నాడు.

బస్సు బయల్దేరడానికి ఇంకా సమ యం వుండడంతో పుస్తకాల షాపుకేసి నడిచాడు.

న్యూస్ పేపర్ (అదీ పక్కవాడి చేతి లోది మాత్రమే) తప్ప మరేమీ చదివే అలవాటు లేని చిదానందం... సాయం త్రానికల్లా తాజాదనం కోల్పోయి పాతదై పోయినా ఇక తప్పదన్నట్లు ఓ పేపర్ చేతిలోకి తీసుకుని... 'వెయ్యినోటు' ముందుకి జాచాడు.

ఒక్కక్షణం షాపువాడు అయోమ యంగా చూసి, పక్కనే వున్న పేపర్ల దొంతు చూపుతూ, "ఈ దొంతు మొత్తం కొన్నా, మీరిచ్చిన నోటుకి నా దగ్గిర చిల్లర లేద్సార్!" అంటూ పేపర్ లాక్కు న్నాడు.

షాపువానికేసి కొరకొరా చూసి, ఏమీ చెయ్యలేక బస్సుకేసి నడిచాడు చిదా నందం.

పక్కనే 'మినరల్ వాటర్' అమ్ముతూ ఓ కుర్రాడు కనిపించాడు. వెయ్యినోటు మారితేగానీ నిద్ర పట్టనట్టున్న చిదా నందం పేపర్ ఘటన దృష్టిలో పెట్టుకుని చిల్లర విషయంముందే తేల్చుకోవాలను కుని, "ఇదిగో అబ్బాయ్, ఓ బాటిలివ్వు" అని అడిగి,

"వెయ్యికి చిల్లరుందా?" అనడిగాడు వెంటనే.

"దానికేం సార్, ఇదుగోండి" అంటూ జేబులోంచి కొన్ని నోట్లు తీసి చకచకా లెక్కబెట్టి బాటిల్, కొంత చిల్లర... చిదా నందం చేతిలో పెట్టి, వెయ్యినోటు తీసు కుని వెళ్ళిపోయాడా అబ్బాయి.

ఇంకాసేపటికి అరటిపళ్ళు అమ్మే అబ్బాయి వచ్చాడు.

మరో నోటు మారితేగానీ మనసు కుదుట పడదనుకున్న చిదానందం, బేర

మాడకుండా డజను అరటిపళ్ళు కొని మరో నోటు మార్చాడు.

హైదరాబాద్ నుండి బయల్దేరిన బస్సు రాత్రి భోజనాలకి ఓ దాభా దగ్గర ఆగింది.

దాభాలో సుష్టుగా భోంచేసి, వెయ్యి నోట్లు మార్చగా, చేతికొచ్చిన చిల్లర నోట్లలో ఓ అయిదొందల నోటు తీసి హోటల్‌వాడి చేతిలో పెట్టాడు చిదానందం.

నోటుని వేళ్ళమధ్య నలుపుతూ ఓసారి పైకెత్తి అటూ యిటూ చూసిన హోటల్ యజమాని, "ఇది నకిలీ నోటు సార్... మరోటి ఇవ్వండి" అన్నాడు.

అతని మాటలు అటంబాంబులా పేలినట్టనిపించిన చిదానందం ఏడుపు మొహంలో అరటిపళ్ళబ్బాయి ఇచ్చిన మరో అయిదొందల నోటు సమర్పించుకున్నాడు.

మళ్ళీ అవే చేతల్ని పునరావృతం చేసిన హోటల్ యజమాని అవే మాటల్ని రిపీట్ చేయడంతో సొమ్మసిల్లి పడిపోయాడు చిదానందం.

వెంటనే మొహంమీద సోడా నీళ్ళు కొట్టిన హోటల్ యజమాని చిదానందం కాస్త తెప్పరిల్లాక సోడా బాటిల్ డబ్బుల్తోపాటు బిల్లు మొత్తం ఎంత యిందో క్లుప్తంగా చెప్పాడు.


ఉసూరుమంటూ మిగతా చిల్లర నుండి వంద రూపాయల నోట్లు తీసి బిల్లు చెల్లిస్తున్న చిదానందాన్ని టేబుల్ పైన పేపర్లో ఒక వార్త విశేషంగా ఆకట్టుకుంది.

అది– "రాజధానిలో రైల్వేస్టేషన్లో, బస్టాండ్‌లలో నకిలీనోట్లు చెలామణీ చేస్తున్న చిల్లర వ్యాపారస్తులు" అన్న వార్త.


చేతిలో వున్న దొంగనోట్లు 'ఎలా వదిలించు కోవాలా?' అని ఆలోచిస్తూ బస్సెక్కిన చిదానందానికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు మరి!

ఇవండీ, 'చి.చి.చి.' అనబడు 'చిదానందం చిల్లర చిక్కులు."

మూడు రాళ్ళు









అజయలక్ష్మి రాజు

పెళ్ళిఫోటో

"అదేమిటి ఎందుకలాగని మేమడిగితే మా అబ్బాయికి ఫారిన్ ఛాన్స్ వచ్చింది. పెళ్ళి బాదరబందీ వద్దు అంటున్నాడు. ఇంకో రెండేళ్ళదాకా కుదరదంటున్నాడు. అంతదాకా మిమ్మల్ని వెయిట్ చెయ్యమనడం సబబు కాదు కదా. అందుకే ఇలా చెప్పాల్సి వచ్చింది. కావాలంటే మీకు నిశ్చితార్థం ఖర్చులు ఇచ్చేస్తాము. మీ అమ్మాయి చదువుకుంది. అందంగా వుంది. మంచి వరుడు దొరకాలని ప్రార్థిస్తున్నాము. బై!" అంటూ ముగించారు.

కారణం ఇదయివుండదు. ఎక్కువ కట్నాన్ని ఆశించటమో మరేదో జరిగి వుంటుందని, శ్రీధర్ వాడి స్నేహితులు కలిసి సి.ఐ.డి. పని చేశారు. తీరా తేలిందేమిటంటే...సమీరకు బాయ్‌ఫ్రెండున్నాడని నింద వేశారు."

"అంటే నిజంగానే..." అనుమానంగా సమీరవేపు చూసింది.

"అలాంటిదేం లేదు అంటీ! కాలేజీ అన్న తర్వాత అబ్బాయిలతో మాట్లాడకుండా ఎలా వుంటాము. ఎడ్యుకేషన్ గురించో... పుస్తకాల గురించో మాట్లాడుకుంటాము. అంతేకానీ ప్రత్యేకంగా నాకంటూ బాయ్‌ఫ్రెండ్ లేదు. అలా వుంటే ఈ అబ్బాయితో పెళ్ళికెందుకు ఒప్పుకుంటాను. అమ్మ నాకు మంచిఫ్రెండు. ఆమె దగ్గర నేనే రహస్యాలు దాచను. నాన్న కూడా మా అభిప్రాయాలకు విలువ ఇస్తారు. నాకందరూ అనుకూలంగా ఉన్నపుడు ఏ విషయమైనా ఎందుకు దాస్తాను చెప్పండి. అతడికి మేమిచ్చే కట్నం నచ్చకనో మరేదో అయ్యుంటుంది" అంది సమీర వెక్కి వెక్కి ఏడుస్తూ.

సమీరను అలా చూడగానే పావనికి కూడా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఓదార్పుగా సమీర చేతిని తన చేతిలోకి తీసుకుంది.

"సరే! వాడి సంగతి తర్వాత చూద్దాం! ఇలాంటివి ఈ రోజుల్లో సర్వసాధారణమై పోయాయి. ఇంత మాత్రానికే ఆలోచించి ఆరోగ్యం పాడుచేసుకోవటం ఏం బాగాలేదు" సుబ్బారావు అన్నాడు.

"వాడు నిజంగా ఫారిన్‌కు వెళుతున్నాడా? ఇక్కడే వుండి మరో పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నాడా? నువ్వు ఎంక్వయిరీ చెయ్యి క్రిష్ణా" అంది శ్రీవల్లి.

"ఎంక్వయిరీ చేసి మాత్రం ఏం లాభం అంటీ! మనకు టైం వేస్ట తప్ప" శ్రీధర్

"అలాకాదు! మనమిప్పుడు ఎంత బాధ పడ్డామో... అంతకు రెట్టింపు బాధ వాడూ పడాలి. ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటాడా దొంగ రాస్కెల్" అంది ఆవేశంగా శ్రీవల్లి.

"అయితే ఇప్పుడేమిటి? వాడిని మార్చి, బాధపడేలా చేసి, కాళ్ళీడ్చి తెచ్చి సమీరకు కట్ట బెడతావా?" సుబ్బారావు అన్నాడు.

"పది లక్షలిస్తానంటే కూడా వాడికిచ్చి చేసేది లేదు... వాడికి బుద్ధి రావాలి, బాధ పడాలి. చేసి చూపిస్తాను చూస్తుండండి" కసిగా అంది శ్రీవల్లి.

ఆ రాత్రి సుబ్బారావు దగ్గర కూర్చుని "ఏంటి నాన్నా! అమ్మ అంతలా ఆవేశపడి ఛాలెంజ్ చేసింది. వాడినేం చేస్తుందేమిటి? మనుషులను పెట్టి కొట్టిస్తుందా?" అడిగింది పావని.

"మీ అమ్మ సమర్థురాలు పావనీ! కొట్టించటం, ఫ్యాక్షనిజం లాంటి పనులు చెయ్యదు. అయినా ఏం చేస్తుందో చూద్దాం."

"అమ్మకు స్నేహితురాలే అయినా కళావతి అంటీ అమాయకురాలు కదా నాన్నా!"

"అబ్బో! వీళ్ళిద్దరూ ఇద్దరేనమ్మా, గడుసు పిండాలు. నన్నూ, హనుమంతును మూడు చెరువుల నీళ్ళు త్రాగించారు కాదూ!

జరిగిన కథ: పావని తల్లి పావనిని చాలా కట్టుదిట్టంలో ఉంచుతుంటుంది. ఆమె అన్నయ్యకు మాత్రం చాలా స్వేచ్ఛనిచ్చి అతను ప్రేమించిన అమ్మాయిని కూడా ఇంటికి రానిచ్చి, నకల మర్యాదలు చేస్తుంటుంది తల్లి. తల్లి ఇద్దరికి చూపుతున్న తేడాని భరించలేకుండా వుంటుంది పావని. అర్ధరాత్రి తండ్రి ప్రాణస్నేహితునికి హార్ట్ అటాక్ వచ్చిందని ఫోన్ అందుకుంటుంది పావని. తండ్రితో చెప్తుంది. -ఇక చదవండి



ఈ కాలం అమ్మాయిల్లా సులభంగా అబ్బాయి వల్లో పడటం పెళ్ళి చేసుకోవటం చెయ్యలేదు. నీకిచ్చిన నవలను చదువు అదంతా మా ప్రేమ కథే!"

"మీ ప్రేమ కథా? అరెరె! మీరేదో చదివి ఫెయిర్ చెయ్యమంటే ఏంటో ననుకున్నా! ఉదయంనించి టైం వేస్ట్ చేశా. ఇంతకీ ఈ కథ యధాతథంగా రాశారా?"

"మొత్తం మీద యధాతథంగా రాశాననే చెప్పచ్చు. కానీ నేను కామెడీని జోడించనిది రాయలేను కదా. అందుకని కల్పితాలు కూడా వున్నాయి."

"అయితే మీరు హనుమంతు అంకుల్ కూడా ప్రేమలో కష్టాలు ఎదుర్కొన్నారన్న మాట."

"ప్రేమలో కష్టాలు కాదు, అమ్మాయి ప్రేమకోసం, అమ్మాయి సంతోషం కోసం కష్టాలను సహించాం."

"మీరూ అమ్మా ప్రేమించుకొని ఇల్లొదిలి పారిపోయారా నాన్నా?"


"అయ్యయ్యో! అలాంటిదేం లేదమ్మా! మా పెళ్లి పెద్ద వాళ్ళు దగ్గరుండి మరీ చేశారు."

"మరిక కష్టాలేముంటాయి. పెద్దవాళ్ళు ఒప్పుకోక కష్టాలు పడ్డారా?"

"అదేం లేదు. ఇలా ప్రేమించుకున్నామో లేదో అలా గ్రీన్ సిగ్నల్ వచ్చింది రెండు వైపులనించి!"

"అయితే కష్టాలు పెళ్ళయ్యాకేనా?"

"కాదు! పెళ్లి కాకముందే. అయినా తినబోతూ రుచులడిగి నట్లుంది.



ఆ నవల మొత్తం చదువు, నీకే అర్థమౌ తుంది."

నవలకు సంబంధించిన పేపర్లు తన గది లోకి తీసికెళ్ళి చదవసాగింది పావని.

చదువుతున్న కొద్దీ అమ్మమీద కోపం, అస హనం మబ్బుల్లా విడిపోసాగాయి పావనికి.

◆ ◆ ◆

చెరువు గట్టుమీద కూర్చుని ఒక్కొక్క రాయే విసురుతున్నాడు సుబ్బారావు.

ఛీ! రాయి విసరగానే నీళ్ళలో అలజడి చేసి తన మెదడుకేదైనా పాయింటు దొరికి పరి ష్కారం దొరుకుతుందేమోననుకుంటే ఈ దరిద్ర పు చెరువులో నీళ్ళు లేవు. ఈ ఊళ్ళో ప్రశాంత మైన స్థలం లేదు. తనలాంటి అభాగ్యులు ఆలోచించుకుంటూ కూర్చోటానికి అనువైన స్థలమూ లేదు. అచ్చి వచ్చిన జీవితమూ లేదు. ఒక్క చిన్న ఫోటో తనకింత మనస్తాపం కలిగి స్తుందనుకోలేదు. తన ప్రేమను ఆ ఫోటో బలి తీసుకోబోతుందా?

శ్రీవల్లి తనకు దూరమౌతుందా?

ఆ ఊహే భరించలేక పోతున్నాడు. శ్రీవల్లికి తనమీద... తన పుట్టుకమీదా అనుమాన మెందుకు? ఆమె తనను మనస్ఫూర్తిగా ప్రేమిం చ లేదా?

'ఆ ఫోటో గురించి తెలియాలి!' అంటూ మొండిగా ప్రవర్తిస్తుందేమిటి. కానీ ఫోటో గురించి తెలిసేదెలా? కనుచూపు మేరలో ఆ దాఖలాలు కనిపించేటట్టు లేవు. సుబ్బారావుకు గట్టిగా ఏడవాలనిపించింది.

ఓసారి ఏడిస్తే మనసు తేలికవుతుందేమో... అనుకుని తననెవరు గమనించటం లేదు కదా అని చుట్టూ ఓసారి పరికించి చూశాడు.

"ఏరా సుబ్బూ! ఇక్కడ కూర్చున్నావ్!" తెలిసిన ఫ్రెండొకడు సైకిల్‌లో వెళుతూనే పలకరించి తుర్రుమన్నాడు.

సుబ్బూ! అని పిలవగానే రక్తం మరిగి పోయింది. సైకిల్ వెనకాలే పరిగెత్తిపోయి వాడిని క్రింద పడేసి తన్నాలనిపించింది...

ఛ్ఛ! ఎంతమందినని తన్నగలడు.

కళ్లకొద్దీ ఆకాశం భూమి దద్దరిల్లేలాగా అందరూ సుబ్బూ! సుబ్బూ! అని అరుస్తున్న ఫీలింగ్!

అసలు తనకాపేరు పెట్టిన నాన్నను... ఛ! వద్దులే! పాపం క్షమించుగాక... అమ్మకు తను

కడుపులో వుండగా సుబ్రమణ్యస్వామి కలలో కన్పించాడుట.

సుఖప్రసవమైతే సుబ్రమణ్యస్వామి పేరు పెట్టుకుంటానని మ్రొక్కుకుందిట. పెద్దాయన ఈశ్వరుడే కలలోకి రావచ్చు గదా! ఆయన కలలోకొచ్చి వుంటే తనకీ ప్రాబ్లం వుండేది కాదు. ఆయన కొడుకును కలలోకి పంపాడు.

అమ్మ తనకు సుబ్రమణ్యం అని పేరు పెట్టింది.


పేరు పెట్టిందన్న మాటేగానీ ఏనాడూ పూర్తిగా నోరారా సుబ్రమణ్యం అని పిలిచిన పాపాన లేదు.

ఐదేళ్ళ దాకా ఒరే చిన్నోడూ! చిన్నోడూ! అని పిలిచారు. ఎందుకంటే అందరికంటే చిన్నవాడు కావటం మూలాన!

"అయ్యో! వీడికి మంచి పేరు పెట్టుకుంటే అది మరుగున పడిపోయి చిన్నాడనే పేరు సార్థకమవుతుందో ఏమిటో!" అంటూ అమ్మ తెగ బాధపడిందిట.

"నువ్వేం బాధపడకు! స్కూల్లోచేర్పిస్తే తప్ప వీడిని వీడి అసలు పేరుతో పిలవరు. స్కూల్లో చేర్పిస్తాగా అంటూ స్కూల్లో ఆరో ఏడు రాగానే చేర్పించారుట.

తెలుగు మీడియంలో చేర్పించాలంటూ అమ్మ, కాదు కూడదు ఇంగ్లీషు మీడియంలో అంటూ నాన్న ఒకటిన్నర నెల పోట్లాడి చివరికి ఇంగ్లీషు మీడియంలో చేర్పించారుట.



అక్కడ స్కూల్లో పేరు రాయించేటప్పుడు... అతడెవరో ఇంగ్లీషు సరిగా రాని మేష్టారు సుబ్రమణ్యం పేరును స్పెల్లింగు మిస్టేకులతో 'సుబ్రా మేన్ హం' అని రాసుకున్నాడట.

నాన్న అది చూసి బెదిరిపోయి ఈ పేరు ఇలాగే కొనసాగితే జీవితాంతం ఇలా స్పెల్లింగు మిస్టేకుల వంశమౌతుందేమోనని భయపడి అదికొట్టేయించి సుబ్బారావని రాయించాడట.


అలా సుబ్బారావుగా స్థిరపడిపోయాడు.

చాలామంది పేర్లలో చివరి రెండక్షరాలతో పిలిచి తరింపచేస్తారు.

అలా పిలుచుంటే తనకు రావు అనే పేరు ఎంత 'డిగ్నిఫైడ్'గా వుండేది. అలా కాకుండా తన ఖర్మ కాలి మొదటి రెండక్షరాలను పట్టుకోవటమే కాకుండా దానికీ మళ్ళీ కొమ్ము కొమ్ముదీర్ఘం తగిలించి "సుబ్బూ! ఏరా దుబ్బూ! అంటూ పిలవసాగారు.

అలాగే పెరిగి పెద్దవాడయ్యాడు.

చిన్న వయసులో అవేవీ అంతగా బాధించ లేదు కానీ కాలేజీలో చేరేటప్పటికి చాలా ఇబ్బంది ఫీలవసాగాడు. కానీ కొంతలో కొంత దేవుడు కరుణించిపెద్ద గీత ప్రక్కన చిన్న గీతలాగ కాలేజీలో తన పేరుకన్నా మొరటు నామధేయులు... సుంకన్న, మల్లన్న, ఎల్లన్న, పుల్లన్న, కుళ్ళాయప్ప... ఇలా దేవతల మొక్కు బడులు మీరలేక నాన్నమ్మలు, అమ్మమ్మల నిరంకుశత్వానికి బలయిన వారుండటం చేత అందరిలోకి తన పేరు అందంగా కనిపించ సాగి అదృష్టయిపోయాడు.



ఈ నేపథ్యంలో 'హనుమంతు' సుబ్బారావుకు ప్రాణమిత్రుడయ్యాడు.

"ఏంట్రా సుబ్బూ! ఇక్కడ కూర్చున్నావు? నీకోసం అంతా వెతికి, వెతికి నీవు చెరువు గట్టుకు వెళ్ళావని తెలిసి వచ్చాను" అన్నాడు హనుమంతు.

"ఏమిటో! చిరాగ్గా వుంది. చెరువు గట్టున కూర్చుని ఒక్కొక్క రాయి విసురుతూ ఆలోచిస్తుంటే నా సమస్యకకు పరిష్కారం దొరుకు

తుందేమోనని వచ్చాను. దేశమంతా వర్షాలు. కానీ ఈ అనంతపురంలో మాత్రం చినుకు లేదు. చెరువు నిండలేదు. ప్చ్!..." నిరాశగా అన్నాడు సుబ్బారావు.

"ఓర్నీ! నీ సమస్య అటుదిరిగి ఇటుదిరిగి కరువు దగ్గరికొచ్చి ఆగిందేమిట్రా నాయనా! ఆ ఫోటో గురించేనా నీ ఆలోచనలు... అయినా ఒక ఆడపిల్లకు కన్విన్స్ చేసి చెప్పలేని వాడివి నువ్వో మగాడివి... నీకో లవ్‌స్టోరీ కూడానూ." వెటకారంగా అన్నాడు హనుమంతు.

"నా ప్రేమ... నా ప్రియురాలు నీకు ఎగతాళిగా మారాయ్యన్న మాట! అయినా ప్రేమ గురించి నీకేం తెలుసు. నీవు ప్రేమలో పడితే తెలిస్తుందీ బాధ" అన్నాడు సుబ్బారావు.

"ప్రేమలో పడాలనే కదా పెళ్లి ఎగరగొట్టాను."

"హా! ఏమిటో విధి ఆడే వింత నాటకం. నీకు ప్రేమ కుదరటం లేదు. నాకు పెళ్ళి కుదరటం లేదు" శూన్యంలోకి చూస్తూ అన్నాడు సుబ్బారావు.

"ఈ ఎండిపోయిన చెరువు దగ్గర నీళ్లు ఇంకిపోయిన కళ్ళతో... నోరెండిపోయిన గొంతుతో... నిన్నిలా చూస్తుంటే నాకు భయమేస్తోందిరా సుబ్బారావ్! నేను లేనప్పుడు పురుగుల మందు గట్రా తాగకేం. నీ క్లోజు ఫ్రెండునని ముందు నన్ను బొక్కలోకేసి కుళ్ళ బొడుస్తారు



పోలీసులు" అన్నాడు హనుమంతు దీనంగా.

"ఆ ఫోటో అమ్మాయి గురించి ఏదైనా సలహా ఇచ్చి సన్నాదుకుని నా పెళ్ళి చేస్తావనుకుంటే నా చావునూహిస్తావా? చిన్నప్పటి నించి..."

"ఆగాగు! ఒక మంచం, ఒక కంచం డైలాగేనా... మరీ అంత లేదులే... చిన్నప్పటి నించి ఓ రకంగా ఏడిపించావుట్రా నన్ను. హమ్మ! హమ్మా!... ఇవుడిలా ఫోటో మూలంగా ఇరుక్కుపోయి నా దగ్గర చిక్కిపోయావుగానీ, మాడు మీద మిరియాలు నూరే మనస్తత్వం కాదూ నీది!.... అప్పుడప్పుడు కొంచెం మంచిగుండి నా స్నేహితుడివనిపించుకున్నావు కాబట్టి ఆ ఫోటో గురించి నీకో సలహా ఇస్తాను" అన్నాడు హనుమంతు.

"హోస్నేరా! ఎంతైనా మనం ఫ్రెండ్సుమి కదా! ఆ సలహా ఏంటో చెప్పరా" గెడ్డం పట్టుకున్నాడు సుబ్బారావు.

కాసేపు ఊరించి "ఆ... ఏం లేదు... సింపుల్... ఆ ఫోటో చింపి పారేసెయ్. శ్రీవల్లిని మరిచిపో..." హనుమంతు మాటలు పూర్తి కాకముందు పిడిగుద్దులు గుద్దాడు సుబ్బారావు హనుమంతుని.

(సశేషం)



అవధానికి పెళ్లి కుదిరింది

కథ

వి.వి.ప్రసాదరావు

ఓరేయ్ చవటసన్నాసీ! మొద్దుమొఖమా నిన్నేరా! లేరా.... లే! బారెడు పొద్దెక్కింది. త్వరగా లేచి బయలుదేరు... జానకీపురం విస్త రాకుల వినోద్‌గారింట్లో పెళ్ళి చెయ్యడానికి వెళ్ళాలని చెప్పి మొద్దునిద్ర పోతావేరా? లేరా, అవధానీ" అంటూ బామ్మ వీపుమీద ఒక్కటి చరిచేసరికి కెవ్వ్...వ్... మని కేకేసి మంచం దిగబోయేసరికి దుప్పటి కాళ్లో పడి ముందుకు తూలిపడ్డాడు.

"ఏంట్రా సన్నాసీ ఏంటా శబ్దం?" అంటూ వంటింట్లోంచి అరిచింది బామ్మ.

"ఆఁ, ఏం లేదే బామ్మా దుప్పటి కింద పడింది" అంటూ మోకాలుకి తగిలిన దెబ్బ నొప్పిని ఓర్చుకుంటూ లేచాడు.

"ఏరా అవధానీ నా చెవిలో ఏమన్నా కాలీ ఫ్లవర్‌లు కన్పిస్తున్నాయా దుప్పటి పడితే అంత శబ్దం ఎలా వస్తుంది?"

"అదికాదే బామ్మా! ఆ దుప్పట్లో నేనున్నానే."

"ఒరేయ్ త్వరగా తెములు. ఇంకో గంటలో దుర్ముహూర్తం ఎంటరైందో ఏ పనీ చెయ్యలేవు. విన్పించిందా?" అరిచింది బామ్మ.

"ఒసేయ్‌బామ్మా త్వరగా కాఫీ కలుపు" అంటూ అప్పలాడిలా బామ్మముందు ప్రత్యక్ష మయ్యాడు అవధాని.

అవధాని చిన్నప్పుడే అమ్మా నాన్నలు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అప్పట్నుంచీ బామ్మే అన్నీ అయి పెంచింది అవధానిని.

తిట్ల దండకంతో లేపినా కొట్టినా అవధాని అంటే బామ్మకి ప్రాణం. అందుకే ఏ పని చెయ్యాలన్నా మంచిచెడులు చూసి మరీ చేయి స్తుంది. బామ్మను ఒకే ఒక విషయం కృంగ దీస్తోంది. అదే, అవధానికి పెళ్ళి కుదరక పోడం. సుమారు పాతిక సంబంధాలు చూసి వుంటాడు. బామ్మకు ఏదో ఒక విషయంలో తేడా కన్పించడం వెంటనే లేచి బయటికి నడవడం ఇదీ వరస.

"ఏరా అవధానీ నాకు తెలీకడుగుతా ఈమధ్య నిన్నేమన్నాపిచ్చికుక్క గట్రా కరి చిందట్రా?" చేతికి కాఫీకప్పు అందించి మరీ అడిగింది.

కప్పు నోట్లో పెట్టిన అవధాని ఒక్కసారిగా పిచ్చికుక్క అనేమాట వినేసరికి తపుక్కుమని కాఫీని ఉమ్మేశాడు.

బామ్మముఖంనిండా కాఫీ తుంపర్లు పడ్డాయి.

"ఓరి బడుద్ధాయి! నామీద ఉమ్మేస్తావా" అంటూ చెంపమీద ఛెళ్ళుమనిపించింది.

అప్పటిదాకా నోట్లో కొద్దిగా వున్న కాఫీ కూడా చెంపదెబ్బతో బామ్మని పావనం చేసింది.

"సారీ బామ్మా!... సారీ... మరి నన్ను పిచ్చి కుక్క కరవడమేంటి? ఆశ్చర్యంగా ముఖంపెట్టి అడిగాడు అవధాని.

మరి మొన్న పదో తారీఖు రాత్రి ఆ రంకెల రామేశం యింట్లో పెళ్ళి జరిపించినప్పుడు పెళ్ళికొడుకుతో 'అరుంధతి' కి బదులు ఐశ్వర్యా రాయ్‌ని చూపిస్తానన్నావట. నీకిదేం పొదల కాలంరా మంత్రాలని సంప్రదాయాలనీ నాశ నం చేస్తావేంటిరా? కనకదుర్గలా ఉగ్రరూపం దాల్చి మరీ అడిగింది బామ్మ.


"ఓ అదా సంగతి! ఏం లేదే బామ్మా. ఆ పెళ్లికొడుకుని 'అరుంధటి' అనే పేరు గల్గిన అమ్మాయి ప్రేమించి మోసం చేసిందిట.... అందుకే 'అరుంధటి' అంటే మంట. ఇక అయ్యగారి వీక్‌నెస్ ఐశ్వర్యారాయ్. ఆ పేరు వింటే చాలు ఎగిరి గంటేస్తాడని తెల్సి అలా ఆఫర్ ఇవ్వాల్సి వచ్చింది. అయినా నీ చాదస్తం గాని ఐశ్వర్యారాయ్ ఆకాశంలో ఎందుకుం టుందే?"

"సర్లే బయలుదేరు. ఇంకా పదినిమిషాలే వుంది. మళ్ళీ దుర్ముహూర్తం, వర్జ్యం వస్తాయి" అంటూ రెక్కపుచ్చుకొని బయటికి నెట్టింది.

అవధానిలో లోపం మీకర్థమయిందికదా... లేదా?... అదేనండీ అవధానికి 'త' అక్షరం పలికేటపుడు అది 'ట' గా ఉచ్ఛరించబడు తుంది.

"ఒసేయ్ బామ్మా ఈసారి నెట్టకే నేనే వెళ తాను" అంటూ వేగంగా వెళ్ళిపోయాడు అవధాని.

సైకిల్ ఎక్కడం ఆలస్యం ఎదురుగా వచ్చి నిలబడింది పక్కింటి పంకజం బామ్మగారు.



ఏరా బదుద్ధాయీ ఎక్కడికి ప్రయాణం?" బోసి నోటితో అడిగింది.

"ఏం లేదు బామ్మా! అలా బజార్లో గంగిరెద్దులా టిరిగొద్దామని బయలుదేరా" కోపంగా చెప్పాడు అవధాని.

"నువ్వు దేనికైనా సమర్థుడివేలే నాయనా వెళ్ళిరా!" అంది పంకజం. అవధానికి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాక జుట్టు పీక్కున్నాడు.


సాయంత్రానికి పెళ్ళినుంచి తిరిగొచ్చిన అవధాని ఎప్పుడూ లేని రెట్టింపు ఉత్సాహంతో ఇంట్లోకి అడుగుపెట్టగానే బామ్మ ఆశ్చర్యపోయి అడిగింది.

"ఏరా మనవాడా! సంభావన నువ్వనుకున్న దానికన్నా ఎక్కువ ముట్టిందా లేక దోవలో బంగారం బిస్కెట్లు గానీ దొరికాయా? ఎందుకంత ఆనందం?" అంటూ అడిగింది బామ్మ.

ఆనందం నుంచి తేరుకొని అవధాని ఇంకా బిగ్గరగా నవ్వసాగాడు.

బామ్మకు కోపం తారాస్థాయికి చేరి గట్టిగా తొడపాశం పెట్టింది. కెవ్వ్...వ్...వ్...మనే కేకతో ఎగిరి గంతేశాడు అవధాని.

అంతే! తలపై అల్మారాలోని ముగ్గుడబ్బా తగిలి ముగ్గంతా బామ్మమీద పడింది.



"సారీ బామ్మా! సారీ" అంటూ బామ్మమీద పడిన ముగ్గంతా తుడిచి నెమ్మదిగా తీసుకెళ్ళి సోఫాలో కూర్చోబెట్టి చెప్పసాగాడు.

"మరేమో బామ్మా! ఈరోజు పెళ్ళిలో నాకొక అమ్మాయి తెగ నచ్చేసిందంటే నమ్ము. ఆ అమ్మాయికి కూడా తెగ నచ్చానట. బామ్మా! నువ్వొక్కసారొచ్చి చూసి ఒప్పుకుని గ్రీన్‌సిగ్నల్ ఇస్తే మా జీవితం అనే రైలు ప్రయాణం సాగుతుంది.

రేపు ఉదయమే నిన్ను తీసుకుని వస్తానని అమ్మాయి వాళ్ళ పెద్ద వాళ్ళకి చెప్పాను. రేపు నువ్వు అమ్మాయిని చూస్తే తప్పక ఒప్పుకుంటావే " అంటూ చెప్పాడు.

అవధాని ఆ రాత్రంతా బామ్మను ఒప్పించి తెల్లవారి అమ్మాయి యింటికి బయలుదేరారు.

కళ్ళకు నల్ల కళ్ళద్దాలు పెట్టుకుని, క్రాఫ్‌ని మోడ్రన్‌గా దువ్వుకుని తెలుగుసినిమాలో యాభైఏళ్ళ నటుడు ఇరవైఏళ్ళవాడిగా తయారయినట్లు తయారయ్యాడు మన అవధాని.

అప్పటికే అమ్మాయి తరఫువారు అన్నీ రెడీ చేసి వుంచారు. ఇద్దరినీ సాదరంగా లోనికి ఆహ్వానించారు. మగపెళ్ళివాళ్ళమనే స్థాయిలో బామ్మ కాలుమీద కాలేసుకుని కూర్చుంది.

డ్రింక్స్ తెప్పించారు. అమ్మాయిని పిలిచారు.

అమ్మాయి కలహంసలా నడిచివచ్చి బామ్మకు సాష్టాంగపడి "నమస్కారం బామ్మగారూ!" అంటూ చెప్పి, కూల్‌డ్రింక్‌ని గ్లాసులో పోసి అవధానికి అందజేసి, సోఫాలో కూర్చుంది.

ఆ తర్వాత కూర్చున్నంత సేపూ బామ్మవైపు చిరునవ్వులు చిందిస్తూనే వుంది.

సంస్కారవంతమైన నమస్కారంతో, చెరగని చిరునవ్వుతో బామ్మను పడగొట్టేసింది.

బామ్మ "అమ్మాయి నూటికి దెబ్బై శాతం ఓకేరా!" అంది.

"మరి మిగిలిన ముప్పై శాతం?" అడిగాడు అవధాని అమాయకంగా.

"ఇంటర్వ్యూరా పిచ్చి సన్నాసీ" అంది.

"ఏమ్మా! మీ నాన్నగారి పేరేంటి? బామ్మ మొదటి ప్రశ్న.

"మా నాన్నగారి పేరు లం... "ఏదో చెప్పబోయింది...

"వద్దు. ఆపేయ్" అంటూ "బామ్మా! వాళ్ళ నాన్నగారిపేరు రంగారావుగారు." అన్నాడు.

"ఐదుద్దాయ్! నేనడిగేది ఆ అమ్మాయిని. నిన్నుకాదు. మధ్యలో నీ వత్తాసేంటి? అమ్మాయ్! మీఅమ్మగారి పేరు?" బామ్మ రెండో ప్రశ్న.

"మా అమ్మాగారిపేరు లం..." అంటూ చెప్పబోతుంటే అవధాని–"వాళ్ళమ్మ గారి పేరు రంగమ్మ." అన్నాడు.

"ప్రతీదానికి నేనున్నానని దూరకు పెళ్ళికి ఒప్పుకోవాల్సింది నేనని మర్చిపోకు" బెదిరించింది బామ్మ.

"చివరగా ఓ ప్రశ్న. నాకు బాగా యిష్టమైన పాట శ్రీరంగ రంగ... మాయన్న కావేటిరంగ" ఈ పాట ఓసారి పాడి వినిపించమ్మా."

"వొద్దు... వొద్దు... వొద్దు" అంటూ ఇంటిల్లిపాదీ చెవులుమూసుకుని మరీ అరిచారు.

"అమ్మాయికి ఆ పాటరాదు. వచ్చినా పాడదు" అన్నారు కోరస్‌గా.

"సర్లే రాకపోతే మాన్లే కనీసం పెళ్ళి అయినాకైనా అమ్మాయికి నేర్పించవచ్చుగా" అమాయకంగా అడిగింది బామ్మ.

"బామ్మా! నువ్వు ఆ పాట నేర్పినా టనకి రాదు. నువ్వు నేర్పలేవు. ఎందుకంటే..." నసిగాడు అవధాని.

"ఎందుకు? చెప్పరా" గద్దించింది బామ్మ.

"ఎందుకంటే బామ్మా... నాకెలాగైతే 'ఆ' అక్షరం పలకటానికి వచ్చిచావదో అమ్మాయికి 'ర' పలకదు. దాని స్థానంలో 'ర' బదులు 'ల' వచ్చి ఛస్తోంది అర్థమయిందా?" అరిచాడు అవధాని.

"ఓరిదేవుడోయ్! ఇంకా నయం నాన్నపేరు, అమ్మపేరు నేనడిగిన పాట పాడివుంటే..? ఏదేమైనా మనవడు ఇష్టపడ్డాడు. అమ్మాయీ బాగుంది. ఒకరి లోపాలొకరికి తెల్సాయి. నాకది చాలు. ఒరేయ్! అవధానీ అమ్మాయి నచ్చింది నీ పెళ్ళికి గ్రీన్‌సిగ్నల్" అంది.

"ఓకే! ఇక ముహూర్తాలు పెట్టించండి" అంటూ చిలిపిగా అవధాని తొడమీద గిల్లింది.

కెవ్వున కేకేశాడు అవధాని. ఏంటని అంతా అడిగితే వీపుమీద చీమ కుట్టిందంటూ... అమ్మాయివైపు తదేకంగా చూస్తుండిపోయాడు అవధాని పెళ్ళికుదిరిందనే ఆనందంలో.

ఒక ఫొటోలో రెండు 'చిత్రాలు'



గమనించారా పై ఫొటోని? ఒక అమ్మాయి కూర్చొనుంటే అబ్బాయి ఆమె మెడని కౌగిలించుకున్నాడు! అంతే కదా! అనుకుంటున్నారు కదా?
అయితే మీరు 'తప్పులో' కాలేసినట్లే.... ఇప్పుడు సరిగ్గా గమనించండి.... ఆ అబ్బాయి కూర్చునుంటే ఆ అమ్మాయే అతన్ని కౌగిలించుకునుంది!
గమ్మత్తుగా లేదూ!


–టీవీఎస్‌శాస్త్రి

బోరనీ పారముంది (పేరడీ)

వేడిగా ఇడ్లీ వుంది...
ఉల్లిపాయ దోశ వుంది...
దేనికో అర్థరియ్యరా!
పొంగుతూ కల్లు వుంది
చీఫ్ క్వార్టరెదురుగుంది
సోదరా ఏది బెస్ట్‌రా?
ఉల్లిదోశ ఇడ్లీలు బోరుబోరు
కల్లుసారాలకన్న బీరు మేలు
కల్లులో కుంకుళ్ళు పిసుకుతారు
సారాలో కల్తీలు కలుపుతారు
రగడ రగడ... రగడ... రగడ రగడ
ఆకలే కేకలేసె
రూకలే బారుమేసె
నూకలే లేవు సోదరా
ఇంటిదే పలుకలేదు
కంటికే కునుకు లేదు
మింటికే ప్రవాణ మొగిసెరా

రోజుతినే అన్నానానికి రోదనేల
ఖర్చు అయిన డబ్బుపైన కాంక్షయేల
భార్యతో వేగలేని పిరికివాద
పుచ్చుకో సన్యాసం పిచ్చివాడా
రగడ రగడ... రగడ... రగడ రగడ
అయ్యో అలినే వదులుకుంటే
జోలెనే నమ్ముకుంటి
యోగిలా మారిపోతిరా!
ఇంటిదాన్ని మరువలేక
ఒంటిగా బ్రతుకలేక...
క్షోభతో గుండె పగిలెరా!
ఎందుకూ పనికిరాని వెర్రివాడా
భూమికే భారంరా నువ్వు దానా
గోదావరి వంతెనెక్కి గోశపెట్టు
తూర్పు దిక్కుకే తిరిగి దండమెట్టు
రగడ రగడ... రగడ...రగడ రగడ

–రాపోలు పరమేశ్వరరావు


రంగు పడుద్ది!
ఈ రోజు హోలీ కదాని... వెరైటీకోసం... ఇలా నిద్ర లేపాను... బావా.....
నన్ను... ఎవరికంట్లో పడకుండా చేయి దేవుడా.....!
BUS STOP
వెంటనే రమ్మని నీకు కబురు చేస్తే... నా హోలీ కవితలు వినడానికేనేమో అనుకున్నా.....
మీ రెంత స్పీడ్‌గా వెళ్ళినా... ఈరోజు నా నుండి తప్పించుకోలేవ్... గురూ!



పవర్‌ఫుల్‌గా లేని 'జబర్‌దస్త్' పబ్లిక్ టాక్!

"బేండ్ బజా భారత్' హిందీ చిత్రానికి రీమేక్‌గా వచ్చిన 'జబర్‌దస్త్' చిత్రం నందిని రెడ్డికి దర్శకురాలిగా 'సినీ పరిశ్రమ సెంటిమెంట్'ను నిజం చేస్తూ ద్వితీయ విఘ్నం కలిగించిందనే చెప్పాలి.

కథ విషయానికి వస్తే అనాథగా పెరిగిన బైర్రాజు (సిద్ధార్థ) దొరికిన కాడకు అప్పులు చేస్తూ, అప్పుల వాళ్ళు వెంట పడుతుంటే దొరక్కుండా పరిగెత్తుతూ వుంటాడు. తనకు నచ్చిన వ్యాపారం చేసి జీవితంలో స్థిరపడ్డాక పెళ్ళి చేసుకోవాలని శ్రీయ(సమంతా) నిశ్చితాభిప్రాయంతో వుంటుంది.

అనుకోకుండా ఇద్దరు కలిసి ఆల్‌ఫంక్షన్స్ మేనేజ్‌మెంట్ సంస్థను ప్రారంభిస్తారు. కొద్దికాలంలోనే మంచిపేరు సంపాదిస్తారు.

వ్యాపారంలో పార్టనర్‌గా వున్న బైర్రాజు తన జీవితంలో పార్టనర్‌గా వుంటే తన లైఫ్ బాగుంటుందని శ్రీయ, బైర్రాజుని ప్రేమిస్తుంది. కాని బైర్రాజు డబ్బుకే విలువ ఇవ్వడంతో ఇద్దరు విడిపోయి చేరో మేనేజ్‌మెంట్ సంస్థ పెడతారు.

మనిషి సహాయం లేక శ్రేయ నష్టపోగా... కొత్తగా వచ్చిన పార్టనర్ సరస్వతి (నిత్యామీనన్) మోసం చేయడంతో బైర్రాజు నష్టపోతాడు. దుబాయిలో వున్న డాన్ (శ్రీహరి) తన చెల్లెలి పెళ్ళికోసం ఇద్దర్నీ తన దగ్గిరకు రప్పించుకుంటాడు.

డాన్‌పై భయంతో బైర్రాజు, శ్రీయ అయిష్టంగా ఆ పెళ్ళి మేనేజ్‌మెంట్ నిర్వహిస్తారు. సూపర్ సక్సెస్ అవుతుంది. ఇద్దరు కలిసి వుంటేనే సక్సెస్ కాగలమని బైర్రాజు, శ్రేయతో కలిసి వుందామని అంటాడు కాని అప్పటికే శ్రేయ పెళ్ళి నిశ్చయం అయివుంటుంది. చివర్లో ఆమెను ప్రేమిస్తున్నట్టు తెలుసుకొని, పెళ్ళి పీటలపై వున్న 'శ్రేయ'ను ప్రేమిస్తున్నట్టుగా చెప్పి, ఆమెని సొంతం చేసుకుంటాడు బైర్రాజు.

పాత్రలను తీర్చిదిద్దడంలో పెట్టిన శ్రద్ధ కథపై దర్శకురాలు పెట్టివుంటే బాగుండేది.

స్క్రీన్‌ప్లే ఒక పద్ధతి ప్రకారం నడిపివుంటే ప్రేక్షకులకు కొంత ఫీల్ అయినా కలిగేది. కొన్ని సీన్సయితే బాగున్నాయి కాని టోటల్‌గా మూవీ మాత్రం శాటిస్‌ఫేక్షన్ ఇవ్వలేకపోయింది.

కథకు సరిపడ నటీనటులు చాలా ముఖ్యమని తెలియజేసిన మూవీ ఇది.

మాస్ పాత్రలకు సిద్ధార్థ సరిపోడని 'బావ' చిత్రం తరువాత 'జబర్‌దస్త్' చిత్రం మరోసారి నిరూపించింది.

సిద్ధార్థకు ఒక స్టైల్ ఆఫ్ ఏక్షన్ వుంది. అందుకే యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ అతని నటనను ఇష్టపడతారు. ఈ చిత్రంలో అతని నటన పరిధిని దాటించి నటింపచేయడంతో ఈ చిత్రం అతనికి హెల్ప్ కాలేకపోయింది సరికదా చిత్రానికి సిద్ధార్థ మైనస్ అయ్యాడు.

సమంతకు పాటల్లో ఓవర్‌గా మేకప్‌వున్నా, నటనలో మెచ్యూరిటీ కనిపించింది.

ఈ చిత్రంలో చెప్పుకోదగిన పాత్ర, నటన, నిత్యామీనన్‌ది. స్పెషల్ అపిరియెన్స్‌లో కనిపించినా, క్యూట్‌గా వుండి ప్రేక్షకులకు ఝలక్ ఇచ్చిన పాత్రలో గుర్తుండిపోతుంది.

షియాజీ షిండే తాగుబోతు రమేష్ పాత్రలు చిత్రాన్ని బోర్‌కాకుండా ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించారు.

ఈ చిత్రానికి మ్యూజిక్ అందించిన తమన్, తన టాలెంట్‌పై కాకుండా ఇతర మ్యూజిక్ డైరెక్టర్స్ టాలెంట్‌ను ఎక్కువ వినియోగించినట్టు అనిపించింది.

చివరకు కోల్గేట్ అడ్వర్‌టైజ్‌మెంట్ మ్యూజిక్‌ను కూడా ప్రేక్షకులకు పరిచయం చేయడం మరిచిపోలేదు.

ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా మలచిన 'జబర్‌దస్త్' చిత్రం టైటిల్ అంత పరవ్‌ఫుల్‌గా రూపొందించడంలో నందినిరెడ్డి పూర్తి సక్సెస్ కాలేకపోయారని చెప్పక తప్పదు.



చంద్రశేఖర్ త్యాడి



వీకైన Mr. పెళ్ళికొడుకు

సునీల్ హీరోగా పెర్ఫార్మెన్స్ కన్నా డాన్సర్ గానే ఇంపార్టెంట్ ఇస్తూ దర్శకుడు చిత్రం తీయడంతో Mr. పెళ్లికొడుకు సక్సెస్ సాధించడంలో విఫలమైంది.

సునీల్ పాత్ర ప్రతి చిత్రంలో ఒకే మూసలో వుంటుంది. ముందుగా అమాయకత్వం, తరువాత సింపతి చివర్లో సిక్స్‌ప్యాక్ బాడీ చూపించడం, ఈ విధంగా చూపించడం సునీల్‌కి విసుగు కలిగించలేదేమో కాని ఆడియన్స్‌కి మాత్రం విసుగొచ్చేసింది.

కథ విషయానికి వస్తే పెళ్ళి చూపులకు అమెరికా నుండి వచ్చిన సునీల్, మొదటి పెళ్ళి చూపులోనే ఇషాచావ్లాను చూసి ఇష్టపడతాడు. కాని ఆమెకు తనంటే ఇష్టం లేదని తెలిసి ఆ పెళ్ళి సంబంధం క్యాన్సిల్ అవుతుంది, కాని వేరే అమ్మాయిలెవరూ సునీల్‌కు నచ్చరు.

కేరళలో ఫ్రెండ్ పెళ్ళికి వెళ్ళిన సునీల్ అక్కడికి ఇషా రావడంతో ఆమెతో ఫ్రెండ్‌షిప్ పెరుగుతుంది. అది ప్రేమగా మారుతుందేమో అని సునీల్ ఆశ పడినపుడు ఆమె బాయ్‌ఫ్రెండ్ కేరళ వస్తాడు. వాళ్ళ రిజిస్టర్ పెళ్ళికి సునీల్ హెల్ప్ అడుగుతుంది ఇషా.

ఏకంగా పెద్దలనే అంగీకరింపజేసి వారి పెళ్ళి జరిపించడానికి సునీల్ సహాయ పడతాడు. ఇషా, తన బాయ్‌ఫ్రెండ్‌పై వున్నది ఇష్టమే కాని ప్రేమ కాదని తెలిసి సునీల్‌ని పెళ్ళి చేసుకోవడానికి నిర్ణయించుకుంటుంది. అందరి సమ్మతంతో సునీల్ ఇషాను పెళ్ళి చేసుకుంటాడు. ఇది టోటల్‌గా కథ.

హీరోయిన్ క్యారక్టర్‌లో స్పష్టత లేనట్టే దర్శకునికి చిత్రంపై స్పష్టత లేనట్టు కనిపిస్తుంది.

మొదటి మూడు సీన్లల్లోనే కథ తెలిసిపోయే విధంగా చిత్రం స్క్రీన్‌ప్లే వుండడంతో టెంపో లేకుండా పోయింది.

సునీల్‌కి డాన్స్‌ల్లో జూనియర్ చిరంజీవిగా పేరు వచ్చి వుండవచ్చు కాని చిరంజీవికున్న ఇమేజ్ వచ్చినట్టు దర్శకుడు పొరపాటు పడ్డాడేమో! సునీల్‌ని సూపర్‌హీరోగా భావించి అతని చుట్టూ కథను అల్లుకుంటూ వెళ్ళాడు.

ఇదే విధంగా సునీల్ కెరీర్ సాగితే అభిమానులు కొంత శాతం పెరగవచ్చు కాని రియల్ ఆడియన్స్ మాత్రం దూరమౌతారు.

సునీల్ ముందుగా తన కెరీర్ ఎలా సాగాలో నిర్ణయించే అవసరం ఎంతైనా వుంది.

అల్లరి నరేష్ చిత్రాల్లో కథలు నరేష్‌కు ఇంపార్టెంట్ ఇస్తూ చుట్టూ వున్న పాత్రలు కథను నడిపించడంలో ఎంతో సహాయపడుతుంటాయి.

కాని ఈ చిత్రంలో సునీల్‌కి సూపర్ ఇమేజ్ కోసం మిగిలిన పాత్రలను డమ్మీలుగా చేసేసారు.

పోనీ సునీల్ సిక్స్‌ప్యాక్ బాడీకి తగ్గట్టు ఏక్షన్ సీన్లు ఏమైనా వున్నా అతని ఇమేజ్ పెరిగేది. అలాగైనా దర్శకుడు ప్రయత్నం చెయ్యలేదు. దాంతో ఈ చిత్రం అందరికి నిరాశే కలిగించింది.

హీరోయిన్ క్యారక్టర్ ముందే చెప్పినట్టు ఎవరికీ అర్థం కాకుండా సాగుతుంది.

సునీల్ డాన్స్ పెర్ఫార్మెన్స్ చూపించే విధంగా అందించిన మ్యూజిక్ మాత్రం హుషారుగా సాగింది. సునీల్ డ్యాన్స్ మూమెంట్స్ అదరగొట్టినా, టివిలో వచ్చే డాన్స్ బేబి డాన్స్ ప్రోగ్రామ్స్‌లా వున్నాయి.

సునీల్‌ను గొప్ప డాన్సర్‌గా చూపించడానికి దర్శకుడు చూపినశ్రద్ధ... ఈ మిస్టర్ పెళ్ళికొడుకు చిత్రం రూపొందించడంలో చూపించి వుంటే చాలా బాగుండేది.





కథ

ఇలా మొదలైంది...!

యు. మల్లికార్జున

'తన కుక్కకి జబ్బు చేసిందని తీర్థయాత్రలు చేయడం మొదలు పెట్టిన మంత్రి... చేతివేలు సర్జరీకోసం ఫారిన్ వెళ్లనున్న ఆరోగ్యశాఖ మంత్రి.. ప్రేమజంటకి పోలీస్ స్టేషన్‌లోనే పెళ్లి జరిపిన పోలీసులు' ...

"అబ్బా... ఈ మధ్య పోలీసులే పురోహితులై... కాణీ ఖర్చు లేకుండా పెళ్లిళ్ళు చేసేస్తున్నారు. కలికాలం" అనుకుని మళ్లీ పరధ్యానంగా పేపర్ చదవడంలో మునిగిపోయాడు పరంధామయ్య.



అప్పుడే గంటకి గంటన్నర వేగంతో, సునామీలా.. సుడిగాలిలో ఇంట్లోకి దూసుకువచ్చి తండ్రిముందు నిల్చుని "నాన్నా... నాన్నా..." ఆయాసపడుతూ చిన్నపాటి కేక వేశాడు పరంధామయ్య పుత్రరత్నం చందు.

"ఆ ఆయాసపడ్డం ఆపి... అసలు విషయం చెప్పరా కన్నా" తాపీగా చెప్పాడు పరంధామయ్య

"నేను మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి"

"చెప్పు. వినబడుతోంది."

"నేను చెప్పబోయేది చాలా సీరియస్ మ్యాటర్. మీ గుండెని రాయి చేసుకొని నే చెప్పేది వినండి"

చటుక్కున పేపరులోనుండి తలతీసి, కొడుకు వైపు చూసి-

"మరీ అంత సీరియస్సా...?"

"ఆ"

"ఒక్క నిముషం ఆగు" అని పరంధామయ్య లోపలికి వెళ్లి మంచినీళ్లు, బి.పి., షుగరు టాబ్లెట్లు తెచ్చుకుని... తాపీగా సోఫాలో కూర్చుంటూ

"ఇప్పుడు చెప్పరా... ఏం భయం లేదు" అన్నాడు.

"నేను ఓ అమ్మాయిని ప్రేమించాను"

"ఓస్... అంతేనా...!"

"మరీ అంత తేలిగ్గా అంటారేమిటి. ఇది చాలా సీరియస్ విషయం"

"నువ్వు ప్రేమించావ్. ఓ.కె. మేము ఒప్పుకోకున్నా ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుని, పిల్లల్ని కూడా కంటావ్. అంతేగా"

"నూటికి వెయ్యి శాతం అంతే... మీరు మా పెళ్లికి ఒప్పుకోవాలి."

"ఒప్పుకోవాల్సింది నేను కాదు. మీ అమ్మ." అని మళ్లీ పేపరు చదవడం మొదలు పెట్టాడు పరంధామయ్య

"అందుకేగా మీకు చెప్పింది. మీరే అమ్మని ఒప్పించాలి."

పక్కలో బాంబు బ్లాస్ట్ అయినట్టు అదిరి పడ్డాడు పరంధామయ్య.

ఆ షాక్ నుండి తేరుకుని...

"చూడు మై డియర్ సన్... శత్రుదేశాల

మధ్య సంధి కుదిరించవచ్చు. అమెరికా అధ్యక్షుడిగా నిన్ను నిలబెట్టి గెలిపించవచ్చు గానీ... మీ అమ్మని ఒప్పించడం కష్టం." కూల్‌గా చెప్పాడు పరంధామయ్య.

"ఇదొక్క మంచిపని చేయండి నాన్న. చచ్చి మళ్ళీ మీకే పుడతా.."

"సేమ్ టూ యు మై డియర్ సన్. నన్నొది లేయ్"

"మరి అమ్మని ఒప్పించడం ఎలా...?"

"సినిమాకు వెళ్లాలంటే టికెట్ కొనాలి. పని జరగాలంటే లంచం ఇవ్వాలి."

"మరి అమ్మని ఒప్పించాలంటే..."

"కాళ్లమీద పడాలి" సింపుల్‌గా చెప్పాడు పరంధామయ్య.

"నో" అరిచినంత పని చేసి..

"ప్రేమ ఎవరి ముందు తలదించదు. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా మా పెళ్లి జరిగి తీరుతుంది." ఆవేశంగా అన్నాడు చందు.

"అదిగో మీ అమ్మ వస్తోంది... పొల్లు పోకుండా... తడబడకుండా ఇదే మాటని మీ అమ్మతో చెప్పు"

పరంధామయ్య అనడమే ఆలస్యం హాల్లోకి ఎంట్రీ ఇచ్చి.. సోఫాలో కూర్చుంది పార్వతి.

మెల్లిగా లేచి.. ఆమె వెనుకకి వెళ్లి చెప్పు.. చెప్పు అని సైగ చేస్తూ నిల్చున్నాడు పరంధామయ్య.

"ఏంటీ... ఇందాకటి నుండి ఏవో అరుపులు వినిపిస్తున్నాయి"

"అదీ... చందు నీతో ఏదో చెప్పాలట..!" అని నసిగాడు పరంధామయ్య.

మొగుడి వైపు సీరియస్ ఓ చూపు చూసి


"నేను హాల్లో రాగానే వెంటనే మీరేం చేయాలి..?"

"ఆ... అర్థమైంది. వెళ్లి కాఫీ తీసుకు రావాలి" అని అక్కడ నుండి నిష్క్రమించాడు పరంధామయ్య.

"అమ్మ నీతో ఒక మాట చెప్పాలి."

"ఎన్ని మాటలైనా చెప్పరా...!"

"నేనో అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయినే పెళ్లి చేసుకోవాలి నిర్ణయించుకున్నాను." పొల్లు పోకుండా చెప్పాడు చందు.



"నువ్వు ఎవర్ని ప్రేమించినా.. పెళ్లి మాత్రం నేను చెప్పిన అమ్మాయినే చేసుకోవాలి."

"అది జరగని పని. నేను ఆ అమ్మాయినే చేస్కోవాలని నిర్ణయించుకున్నాను."

పరంధామయ్య కాఫీ తెచ్చి పార్వతికి ఇచ్చి... ఆమె వెనుకనే నిల్చున్నాడు.

"అదీ జరగని పని. ఒకవేళ నువ్వు ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటే నా ఆస్థిలో చిల్లి గవ్వ కూడా ఇవ్వను."

"నీ చిల్లిగవ్వలు నాకక్కర్లేదు. అవి ఇప్పుడు చెల్లడం లేదు. కోర్టులో కేసు వేస్తే నా ఆస్థి నాకు నడుచుకుంటూ వస్తుంది" బెదిరిస్తున్నట్టు అన్నాడు చందు.

ఆ మాటకి ఆవేశంతో-

"నీ పెళ్లి ఎలా జరుగుతుందో నేనూ చూస్తాను" అంది పార్వతి.

"చూడమ్మా మా ప్రేమ అవ్యాజమైనది... అనంతమైనది... అద్వితీయమైనది...సృష్టి తారుమారైనా... సూర్యచంద్రులు గతి తప్పినా..."

"రేయ్.. రేయ్.. నాకే ఒక్క ముక్క అర్థం కావడం లేదు. మీ అమ్మకి అర్థమయ్యేలా కాస్త తెలుగులో చెప్పరా...!"

"మమ్మల్ని ఎవరూ విడదీయలేరు. మేము పెళ్లి చేసుకుని తీరతాం..!

"పోనీలేవే... ఒప్పుకో. ఈ మధ్య పెళ్లిళ్లు పోలీసుస్టేషన్లలో జరుగుతున్నాయట. అక్కడ వీడి పెళ్లి జరిగితే నువ్వు చూళ్లేవ్.. వీడి పెళ్లి చూద్దామన్న నీ కోరిక తీరదు."

"ఆ...అవును నేను అక్కడే చేసుకుంటాను. ఎవరు ఆపుతారో చూస్తాను." అన్నాడు చందు.

మొగుడి వైపు కోపంగా చూసింది పార్వతి.

"నువ్వలా చూడ్డం కాదు... వాడు నాలా కాదు. అన్నంత పని చేస్తాడు. ఒప్పుకోవే..!"

పార్వతి బెట్టు వదిలి...

"సరే. ఆ అమ్మాయి ఎవరో.. ఏంటో చెప్పమనండి."


"చెప్పరా... ఆలోచించిన ఆశాభంగం, మించిన రాదు మంచి అవకాశం. ఆ చెప్పేది అర్థమయ్యేలా చెప్పు."

"అవేవి నాకు తెలియదు. నేనూ ఆ అమ్మాయిని ఒక్కసారే చూశాను."


"ఎక్కడ" ఆతృతగా అడిగాడు పరంధామయ్య

"నిన్నరాత్రి కల్లో కన్పించింది. ఈ రోజు మళ్లీ కన్పిస్తే అడ్రస్, ఫూరు పేరు కనుక్కు చెప్తా...!" అంటూ ఆవలిస్తూ బెడ్రూంలోకి వెళ్లిపోయాడు చందు.

చైనా బజార్



Gia Yu, China




Yu Liang, China




Wang Jinhai Non, China



Ye Ting, China




Xia Bing, China



Feng Gui Bo, China



Ji Da Li, China



Xu Peng Fel, China



Yu Liang, China

కొలపల్లి ఈశ్వర్ సీరియల్



"సరే, కానియ్ అయితే!"అనక తప్పలేదు చిట్టిబాబుకి.

దాంతో 'అడ్డదీ అలా రా దారికి' అనుకుంది రుద్రమ.

చిట్టిబాబుకి అప్పుడే మండడం ప్రారంభమైంది కానీ నిగ్రహించుకున్నాడు.

'చుంచుమొహం వేసుకుని ఎలా చూస్తున్నాడో చూడు' అనుకుంది రుద్రమ.

నిజానికి చిట్టిబాబుది చుంచుమొహం ఏం కాదు. కేవలం అతన్ని టెస్ట్‌చేయడానికే అలా అనుకుందామె.

ఈసారి చిట్టిబాబుకి కొంచెం ఎక్కువగానే మండింది గానీ, అయినా తమాయించుకున్నాడు.

"అడ్డదీ! నేనేమనుకున్నా సరే, అలా కుక్కిన పేనులా పడి వుండాలి. అలాగైతేనే చేస్తాను నీతో కాపురం' అనుకుంది రుద్రమ.

చిట్టిబాబుకి ఈసారికూడా బాగా మండింది గానీ,... అయినా ఓర్చుకున్నాడు. మాట ఇవ్వాడుగా!

'వెరీగుడ్... వెరీగుడ్... చాలా మార్పొచ్చిందిలే! ఫర్లేదే... ఇంతోలేనే ఇంతమార్పా?' అనుకుంది రుద్రమ.

"అవును రుద్దూ! నాలో ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. పంది, కుక్క, నక్క ఇలా నా గురించి నువ్వేమనుకున్నా సరే, ఇకనుంచి నేను పట్టించుకోను తెలుసా?" అన్నాడు ఆనందంగా చిట్టిబాబు. ప్రియసతీమణి వెరీగుడ్. వెరీగుడ్ అని అనుకుంటే ఆనందం కలగదా ఏంటి?

అతనలా అనగానే అతన్ని మరింతగా టెస్ట్ చేసి ఉడికించాలనిపించి 'పందిముఖం' అనుకుంది రుద్రమ మనసులో.

అయినా పట్టించుకోలేదు చిట్టిబాబు.

వెంటనే 'కుక్క నాలుక వేసుకుని...' అనుకుంది రుద్రమ.

అయినా నోరు మెదపలేదు చిట్టిబాబు.

ఆ వెంటనే 'గుంటనక్కలాగా చూస్తున్నాడు చూడు!' అనుకుంది రుద్రమ కసిగా పళ్లు కొరుకుతూ.

అయినప్పటికీ తనని కాదన్నట్టే వుండి పోయాడు చిట్టిబాబు.

'వెరీ గ్రేట్ ఛేంజ్' అనుకుని అయినప్పటికీ ఇంకా టెస్ట్ చేయాలనిపించి, "యు ఆర్ ఏ ఫూల్, నో నో ఫూలాఫ్‌ఏ యాస్..." అనుకుంది రుద్రమ చిట్టిబాబు వంక పరీక్షగా చూస్తూ.

పంది, కుక్క, నక్కలతో తృప్తిపడకుండా ఆమె తనని యాస్ (గాడిద) తో కూడా పోల్చినందుకు చాలా బాధగా అనిపించింది చిట్టిబాబుకి.

అయినా తమాయించుకున్నాడు.

కనీసం ఆ బాధ ముఖంలోకూడా కనిపించనివ్వకుండా జాగ్రత్త పడ్డాడు.

ఆ సంగతి రుద్రకి ఏం తెలుసు? 'యాస్' అనుకున్నా కూడా పట్టించుకోలేదంటే ఈ మనిషి టోటల్‌గా మారిపోయినట్టే' అనుకుని లోలోన సంబరంగా.

"పోనీలే రుద్దూ! ఇప్పటికైనా నేను మారిపోయానని నమ్మగలుగుతున్నందుకు సంతోషం! మనమింక ఇంటికి వెళ్దామా?" అన్నాడు చిట్టిబాబు కూడా సంబరంగా.

"సరే కానివ్వండి!" అనేసింది రుద్రమ.

కోడల్ని వెంటబెట్టుకుని కొడుకు తిరిగొచ్చేసరికి 'హమ్మయ్య' అనుకుంది తాయారమ్మ మనసులో.

"లోపలికెళ్ళు తల్లీ! ఇకనుంచి వాడు నిన్నేం అనుకుండా నే చూస్తాగా" అంది కోడల్ని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంటూ.

'తమరు చూసేదేంటి బోడి? నా బొంద! మళ్ళీ గనక ఏవన్నా అంటే మళ్ళీ వెళ్ళిపోతానంతేగా!' అనుకుంది రుద్రమ మనసులో.

ఎంత పొగరో! అనిపించినా కూడా ఇచ్చిన మాటకి కట్టుబడి పైకి ఏం అనలేదు చిట్టిబాబు.

రుద్రమ గర్వంగా నడుచుకుంటూ తన

జరిగిన కథ: బస్టాప్‌లో బస్ కోసం ఎదురు చూస్తుండగా ఒక అందమైన అమ్మాయి చిట్టిబాబుని చూసి నవ్వుతుంది. ఆమె ఎందుకు నవ్వుతుందో అర్థం కాక ఎదుటి వాళ్ళు మనసులో అనుకున్నది తెలిస్తే ఎంతబాగుంటుందో అనుకుంటాడు. అలా అనుకోగానే ఎదుటివాళ్ళు అనుకుంటున్నవన్నీ చిట్టిబాబుకి తెలిసి పోతుంటాయి. బస్టాప్‌లో కనిపించిన అమ్మాయితో చిట్టిబాబు పెళ్ళి జరుగుతుంది. అయితే మొదటిరాత్రి ఆ అమ్మాయి మనసులో అనుకుంటుందంతా తెలిసి చాలా బాధపడ్డాడు చిట్టిబాబు. అలా భార్య మనసులో తన గురించి అనుకున్నవి తెలుసుకుని భార్యాభర్తలిద్దరూ గొడవ పడ్తుంటారు. **-ఇకచదవండి**

గదిలోకి వెళ్ళిపోయాక "ఇకనుంచి తన మనసులోని మాటల్ని పట్టించుకోనని ప్రామిస్ చేసి ఎలాగోలా వెనక్కు తీసుకొచ్చాను. జరిగిందేదో జరిగింది. నువ్ కూడా ఇంకేం అనకు తనని" అన్నాడు తల్లితో చిట్టిబాబు.

"బాగుంది సంబరం! భలేవాడివిరా నువ్వు! నేనెందుకు తీస్తాను దాని జోలి? నాక్కావలసింది మీరిద్దరూ సుఖంగా వుండటం అంతే!" అనేసింది తాయారమ్మ.

అలిగి వెళ్ళిపోయిన వదిన అంతలోనే తిరిగొచ్చేసినందుకు చిట్టిబాబు తమ్ముళ్ళిద్దరూ కూడా ఎంతగానో సంతోషించారు.

అన్నా, వదిన, అమ్మల మధ్య గొడవ ప్రారంభ మైనప్పుడు వాళ్ళుకూడా అక్కడే వున్నారు. కానైతే చిన్నపిల్లలు కాబట్టి నోళ్ళు మెదపలేదంతే!

◆◆◆

ఆ రాత్రి...

చిట్టిబాబు తనని ప్రేమగా దగ్గిరికి తీసుకోబోతే 'ఈ డేంజరస్ ఫెలో నిజంగా మారిపోయినట్టేనా? లేక మళ్ళీ మొదటికి వస్తాడా?' అనుకుంది రుద్రమ.



"అదిగో మళ్ళీ దేంజ..." అనబోయి అతి ప్రయత్నంమీద నిగ్రహించుకున్నాడు చిట్టిబాబు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఆమె అంతరంగాన్ని పట్టించుకోకుండా తనపని తాను చేసుకుపోయాడు.

అంటే, కౌగిలిలోకి తీసుకున్నాడన్నమాట.

ఆ కౌగిలిలో కరిగిపోవాలనే అనిపించినా అంతలోనే కాస్త బెట్టు చేయాలని అనిపించింది రుద్రమకి.

"ఇందాక ఏమన్నారూ? కలిసి కాపురం చెయ్యక్కర్లేదు... ఇంటికొచ్చేస్తే చాలున్నారుగా." అందతన్ని నెట్టేస్తూ.

"అప్పుడేదో అలా అన్నాను కానీ, నీ అందాన్ని చూస్తూ నిగ్రహించుకోగలగటం నా తరమా డార్లింగ్!" మళ్ళీ రుద్రమని కౌగిల్లోకి లాక్కుంటూ అన్నాడు చిట్టిబాబు.

"ఈ జ్ఞానం మొదటినుంచే వుంటే ఎంత బాగుండేది!' అనుకుంది రుద్రమ. లోలోన కొంచెం సంతోషిస్తూ.

పట్టించుకోలేదు చిట్టిబాబు.

తన పనేదో తను చేసుకోపోసాగాడు.

అంటే... తప్పు తప్పు... అలాంటివన్నీ చెప్పకూడదు (రాయకూడదు కూడా!)

అతని చేష్టకి పరవశించిపోతూ 'అనవసరంగా నా అంతరంగాన్ని పట్టించుకుని రోజులన్నీ వృథా చేసేస్తున్నాడేగానీ మొత్తానికి రసికుడే!' అనుకుంది రుద్రమ.

ఆ ఆఖరి నాలుగు అక్షరాల కన్నా నచ్చే కాంప్లిమెంట్ మగాడికి మరేముంటుంది?

సహజంగానే బోలెడంత సంబరపడిపోయి మరింతగా చెలరేగిపోయాడు చిట్టిబాబు.

'అబ్బ! ప్రతిరోజూ ఈ మనిషి ఇలాగే వుంటే ఎంత బాగుణ్ను!' అనుకుంది రుద్రమ ఆనందంగా.

అది గ్రహించి "ఇంకెప్పటికీ ఇలాగే వుంటాను. నువ్ నీ మనసులో ఏమనుకున్నా పట్టించుకోను' అని మరోసారి మనసులోనే గట్టిగా నిర్ణయించు

కున్నాడు చిట్టిబాబు.

అలా ఆ రేయి హ్యాపీగా గడిచిపోయింది వాళ్ళిద్దరికీ!

✦✦✦

మర్నాడు సాయంత్రం అసురసంధ్యవేళ క్రితంరోజు రుద్రమతో చెప్పినట్టుగానే తథాస్తు దేవతల్ని దీనాతిదీనంగా వేడుకోవటం ప్రారంభించాడు చిట్టిబాబు.

తన గదిలో ఒంటరిగా కూర్చుని "తథాస్తు దేవతలారా! మీరు నాకిచ్చిన అద్భుతశక్తిని వెనక్కి లాగేసుకోండి..." అని అతను ఎంతో ఇదిగా తమని ప్రార్థిస్తుంటే...

అప్పుడే ఆకాశ విహారానికి వచ్చిన తథాస్తు దేవతలు చిట్టిబాబు వేడుకోలు విని "ఏం చేద్దాం?" అని తమలో తాము డిస్కషన్స్ ప్రారంభించారు.

"పాపం! అంతదీనంగా వేడుకుంటున్నాడు గదా! ఆ దివ్యశక్తిని వెనక్కి లాగేసుకుంటే పోలా?"

"అదెలా లాగేసుకుంటాం? ఒకసారి ప్రసాదించిన శక్తిని వెనక్కి తీసేసుకోవటం అసలేమన్నా పద్ధతిగా వుంటుందా?"

"ఎందుకుండకూడదూ? ఆ దివ్యశక్తి వల్ల అతని సంసారంలో చిచ్చు రేగుతూ వుంది. చూస్తూనే వున్నాంగా! అతనెన్ని పాట్లు పడుతున్నాడో! మనవల్ల ఎవరికైనా మంచి జరగాలే తప్ప... చెడు జరిగితే మనం దేవతలం ఎలా అనిపించుకుంటాం?"

"అదేం మాట? ఇపుడంటే చెడు జరుగుతా వుంది. కానీ, ఇంతకు ముందల్లా అతనికా దివ్యశక్తి వల్ల మంచే జరిగిందిగా! బోలెడంత డబ్బూ దస్కం, పేరు ప్రఖ్యాతులూ సంపాదించుకున్నాడుగా!"

"కావచ్చు, కానీ ఏం లాభం? అంత డబ్బు వుండికూడా ఇపుడు తాను సుఖపడుతున్నది ఏముంది? చిలకా గోరింకల్లా వుండాల్సిన ఆ దంపతులు పాపం! మనవల్లేగా సఖ్యంగా వుండలేకపోతున్నారు... చింతిస్తున్నారు."

"నిజమే అనుకో... అయితే మాత్రం ఇచ్చిన శక్తిని వెనక్కి తీసుకోవడం ఏంటి అసహ్యంగా? ఒక్కసారి ఒకరికొసగినదాన్ని... అదేవన్నా కావచ్చు... మళ్ళీ వెనక్కి లాగేసుకోవడం ఎంత తప్పు? ఎంత అనైతికం?"

"ఏంకాదు. మనకై మనం వెనక్కి లాగేసుకుంటే అది తప్పు నువ్ చెప్పినట్టు! కానీ లాగేసుకోమని అతనే దీనాతిదీనంగా వేడుకుంటున్నప్పుడు... మనకేంటి? అది తప్పు ఎలా అవుతుంది చెప్పు?"

"అంతేనంటావా?"

"ముమ్మాటికీ అంతే!"

"అయితే అతనికి మనమిచ్చిన ఆ దివ్యశక్తిని వెనక్కి లాగేసుకుందామా?"

"అంతకుమించి ఏంలేదు! అదే మంచిది. అటుచూడు... పాపం ఎంత దీనంగా వేడుకుంటున్నాడో!"

అలాచాలాసేపు డిస్కషన్ చేసుకున్నాక చిట్టిబాబులోని అద్భుతశక్తిని నశింపచేయాలని నిర్ణయించుకున్నారు తథాస్తు దేవతలు.

దేవతలుకదా, ఒకసారి ఒక నిర్ణయాని కొచ్చాక మీనమేషాలు లెక్కించాల్సిన అవసరం వాళ్ళకి ఏముంటుంది? వెంటనే నశింప జేసేశారు వాళ్ళు చిట్టిబాబులోని ఆ అద్భుత శక్తిని.


✦✦✦


"ఏం చేస్తున్నారిక్కడ?" అంటూ వచ్చింది రుద్రమ. గదిలో ఒంటరిగా వున్న చిట్టిబాబు దగ్గరికి.


"నిన్న నీతో చెప్పాగా, తథాస్తు దేవతల్ని ప్రార్థిస్తానని. ఆ పనే చేస్తున్నా!" అన్నాడు చిట్టిబాబు వున్న విషయాన్ని సిన్సియర్‌గా చెపుతూ.

"విన్నారా వాళ్ళు మీ ప్రార్థన?" అతనికి ఎదురుగా బైటాయిస్తూ అడిగింది రుద్రమ.

"ఏమో! నాకేం తెలుసు? నేనైతే నా







మనసులో ప్రార్థన చేశాను. నీతో చెప్పినట్టే దీనాతిదీనంగా వేడుకున్నాను.మరి ఏం జరుగుతుందో వేచి చూద్దాం?" అన్నాడు చిట్టిబాబు.

"అయితే, మీప్రార్థన వాళ్ళు విన్నారో, లేదో నేనిపుడు టెస్ట్ చేయాలన్నమాట?" అంది రుద్రమ గడ్డం క్రింద చెయ్యి వుంచుకుంటూ!

"అదెలా?" అన్నాడు చిట్టిబాబు అమాయకంగా.

"బొత్తిగా బుర్ర లేదీ మనిషికి' అని మనసులో అనుకుని "నేనిపుడు నా మనసులో ఏమనుకున్నానో చెప్పండి?" అంది రుద్రమ.

ఆ దిక్కుమాలిన శక్తి ఇప్పుడు చిట్టిబాబులో వుండి ఏడిస్తేగా? అది అప్పుడే హుష్‌కాకి అయిపోయింది.

"ఊహూఁ... ప్రస్తుతం నువ్ నీ మనసులో ఏమీ అనుకోలేదు" అన్నాడు అడ్డంగా తల ఆడిస్తూ చిట్టిబాబు.

అతనలా అంటుంటే రుద్రమ కళ్ళు మిలమిలా మెరిశాయి.

ఆమె ముఖం నిండా ఆనందం అలుముకుపోయింది.

"అబ్బ! ఎంత అదృష్టమండీ! వాళ్ళు మీ ప్రార్థనలు ఆలకించారు. మీలోంచి ఆ పనికిమాలిన శక్తి తొలగిపోయిందిపుడు..." అంది మరింత ఆనందంగా చేతులు పైకెత్తుతూ రుద్రమ.

"నిజంగానా? ఎలా చెప్పగలుగుతున్నావ్? నీకెలా తెలుసు?" అనడిగాడు చిట్టిబాబు.

'బ్రెయిన్‌లెస్‌ఫెలో' అని మనసులో అనుకుని "ఇప్పుడేమనుకున్నానో చెప్పండి? మీ గురించి ఇప్పుడే నా మనసులో ఒక మాట అనుకున్నాను. అదేంటో చెప్పండి?" అనడిగింది రుద్రమ నడుంమీద చేతులుంచుకుంటూ.

"ఇప్పుడూ ఏం అనుకోలేదు... ఇందాకా ఏం అనుకోలేదు..." అన్నాడు చిట్టిబాబు మళ్ళీ అడ్డంగా తల ఆడిస్తూ.

"ఏంకాదు...ఇందాకేమో బొత్తిగా బుర్రలేదీ మనిషికి! అనుకున్నాను. ఇపుడేమో బ్రెయిన్‌లెస్ ఫెలో అనుకున్నాను..." ఉత్సాహంగా చెప్పింది రుద్రమ.

"మరయితే చెవిలో బూరపెట్టి ఊదినట్లుగా నాకు వినిపించాలిగా? ఎందుకని వినిపించలేదు?" బుగ్గలు నొక్కుకుంటూ అడిగాడు చిట్టిబాబు. విచిత్రంగా కళ్ళు ఆర్పుతూ.

"ఎందుకేంటీ? వాళ్ళు మీ ప్రార్థనలు ఆలకించారు కాబట్టి వినిపించలేదు. మీలోని ఆ శక్తిని లాగేసుకున్నారు కాబట్టి వినిపించలేదు..." అతని బుర్రమీద ప్రేమగా ఓ మొట్టికాయ వేస్తూ చెప్పింది రుద్రమ.

అంతేనా? అతని బుగ్గల మీది చేతులు తొలగించి తన రెండు చేతులతో అతని బుగ్గలు సాగదీసి వదిలిపెట్టింది. "చిన్నికన్నా!" అని కూడా అంది.

దాంతో చిట్టిబాబు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బులయ్యాడు.

"ఈరోజు ఎంత శుభదినం రుద్దూ!" అన్నాడు పట్టరాని ఆనందంతో ఆమెని గట్టిగా వాటేసుకుంటూ.

"ఏంటీ పాడుపని? ఇదేం మన బెడ్‌రూమ్ కాదు. అత్తయ్య వస్తుందేమో వదలండి..." అంది రుద్రమ సుతారంగా నెడుతూ.


"ఛఛ! అందుక్కాదులే... పట్టరాని ఆనందంతో కౌగలించుకున్నా" అన్నాడు చిట్టిబాబు సిగ్గుపడిపోతూ.

"మీ సిగ్గుచిమడ! సీమచింతకాయ పండినట్టు మొహమూ! ఆడదానిలా ఎంతందంగా సిగ్గుపడుతున్నాడో...' అనుకుంది రుద్రమ.

అయినా చిట్టిబాబుకి అదేం వినిపించలేదు.

'పీడ వదిలిపోయింది. ఇకనుంచి ప్రతి రాత్రీ వసంతరాత్రే!' అనుకుంది రుద్రమ లోలోపల సిగ్గులమొగ్గవుతూ.

అయినా వినిపించలేదు చిట్టిబాబు కది!



'ఈ రాత్రికే కాదు... అసలు ఏ రాత్రికీ నేను నిద్రపోను. ఈయన్నీ నిద్రపోనివ్వను..." అనుకుంది రుద్రమ.

"ఏంటి ఆలోచిస్తున్నావ్ నీమనసులో?" అనడిగాడు చిట్టిబాబు రుద్రమని కొంటెగా చూస్తూ.

ఎలా చెప్పగలుగుతుంది రుద్రమ మరి?

"ఛీ పోదు! అలాంటివన్నీ పైకి చెప్పు కుంటారా ఏంటి?" అంది బిడియంగా.

"రుద్దూ రుద్దూ! ప్లీజ్ చెప్పవూ? నీ మనసులో ఏమనుకుంటున్నావో చెప్పవూ?" అనడిగాడు చిట్టిబాబు ఆమె గడ్డం పట్టుకుని బ్రతిమాలాడుతూ.

"నథింగ్‌డూయింగ్. నేను చెప్పను గాక చెప్పను..." అంది మొండిగా నాలుక బయటకు పెట్టి చిలిపిగా వెక్కిరిస్తూ.


"రుద్దూ రుద్దూ! ప్లీజ్... ప్లీజ్" అన్నాడు చిట్టిబాబు ఆమె భుజాల్ని పట్టుకుని కుదుపుతూ.

వేడుకోలుగా ముఖంపెట్టి అడుగుతున్న చిట్టిబాబు వంక మరింత చిలిపిగా చూస్తూ, కళ్ళు మూసుకుంది.

ఎంత వేడుకుంటే మాత్రం? ఎంత మొగుడైతే మాత్రం? స్త్రీ అటువంటి అలాంటి మాటల్ని పైకి ఎలా చెప్పగలుగుతుంది? రుద్రమ కూడా ఓ మామూలు స్త్రీయే కదా!

"ఛీపోదు! నాకు సిగ్గేస్తోంది బాబూ!" అంది అరచేతుల్లో ముఖం దాచుకుంటూ.

దాంతో చిట్టిబాబులోని కుతూహలం మరింతగా పెరిగిపోయింది. తెలుసుకోవాలన్న ఆశ, ఆసక్తి విజృంభించింది.



"అంతేనా రుద్దూ? అంతేనా? ప్లీజ్? నీ మనసులో ఏమనుకున్నావో చెప్పవూ?" అనడిగాడు మరింత దీనంగా ఇలాంటి సమయాల్లో బ్రతిమలాట బాగా ఉపయోగపడుతుందని అతనికి ఈ మధ్యే అనుభవాని కొచ్చింది.

"చెబితే మీరు నాకు సిగ్గులేదనుకుంటారు... ముఖంమీదనుంచి చేతులు తప్పించకనే అంది రుద్రమ.

ఆ పని తానుచేస్తూ "అంటే, ఆమె ముఖం మీద నుంచి చేతుల్ని తాను తప్పిస్తూ "ప్లీజ్ రుద్దూ! అలా నేనేం అనుకోన్లే... చెప్పు! ప్లీజ్!" అన్నాడు చిట్టిబాబు మరింత రొమాంటిక్‌గా!

"ఊహూఁ..." అంటూ అడ్డంగా తలాడించింది రుద్రమ అరమోడ్పుకన్నులతో.

"అంతేనా?" అంటూ బుంగమూతి పెట్టాడు.

"చెప్పనుగాక చెప్పను..." అంటూ మళ్ళీ నాలుక బయటపెట్టి వెక్కిరించింది రుద్రమ.

అతనిలోని ఓర్పు తగ్గింది. అసహనం పెరిగింది. దాంతో చిట్టిబాబుకి ఒళ్ళు మండిపోయింది.

ఎదుటివ్యక్తి మనసులో ఏముందో తెలుసుకోగలిగే శక్తి నాకు వుంటే ఎంత బాగుణ్ణు! అనికూడా అనుకోబోయాడా బాధలో. కానీ అంతలోనే అతని ఒంటిమీదకు తెలివివచ్చింది సర్రున జెర్రిపోతులా పాకుతూ.

ఇంత జరిగినా కూడా ఇంకా అలా అనుకోగలగటానికి అతనేమన్నా మెంటల్‌గాడా?

అందుకే అలా అనుకోబోయినందుకు మనసులోనే చెంపలు వాయించుకుని "పోన్లే చెప్పొద్దులే!" అనేశాడు మూతిని సున్నాలా చుట్టి సింపుల్‌గా.

ఆ మూతిమీద తన పెదాలతో సున్నితంగా అద్ది "శ్రీవారికి కోపమొచ్చిందా?" అనేశాక, గబుక్కున అటు తిరిగేసింది సిగ్గుతో రుద్రమ.

"కాదు తాపమొచ్చింది" అంటూ ఆమెను వాటేసుకోబోయాడు.

"కాస్త తగ్గండి దొరగారూ! మీ తాపాలూ, గీపాలూ, విరహాలూ ఇప్పుడు కాదు... దీపాలు పెట్టాక... రాత్రికి మన బెడ్‌రూమ్‌లో..." అనేసి లేడిలా పరుగు తీసింది అక్కడినుంచి.

"రాత్రికి దొరుకుతావ్‌గా, అప్పుడు చెప్తా" అనుకున్నాడు చిట్టిబాబు.

సమాప్తం




వా ట ర డే
పైన వాటర్‌ప్రాబ్లమ్ ఉండదేమోనని
TO-LET
ఫుల్ వాస్తు.. పార్కింగ్ ప్లేస్ ఫినిషింగ్ వార్డ్‌రోబ్స్.. బట్ వీక్లీ వన్స్ వాటర్..
ధాబా హోటల్
ఫుల్‌బీరు - 150/-
లీటర్‌నీరు - 1500/- మాత్రమే
వాటర్‌డే సందర్భంగా శుభ్రంగా కడుపునిండా నీళ్ళు తాగి... హాయిగా స్నానం చేద్దాం డియర్!



కథ

దొందూదొందే...

శ్రిష్టి శేషగిరి

బస్సు విజయవాడ వైపు పరుగులు తీస్తూంది.

అర్ధరాత్రి కావడం చేత ప్రయాణీకులంతా గాఢనిద్రలో వున్నారు.అందులో ఒకవ్యక్తికి నిద్ర పట్టక డ్రైవర్ వద్దకు వచ్చాడు.

కాసేపు కబుర్లు చెప్పడం మొదలెట్టాడు డ్రైవర్‌తో.

"ఇంకా ఎంతసేపు పడుతుందోయ్ విజయవాడ?" అని అడిగాడు సంభాషణ మధ్యలో.

"ఆ... ఎంతసార్! దాదాపు రెండుగంటలు పట్టవచ్చు" అన్నాడు తాపీగా.



"ఎంత వేగంతో వెళ్తుంది బస్సు?" అని మళ్ళీ ప్రశ్నించాడు.

"ఆ... ఎంత సార్. యాభై అరవై కిలో మీటర్ల వేగం. అంతే."

ఓహో... అలాగా" అంటూ ఇద్దరూ ఏవో కబుర్లలో పడిపోయారు.

"సార్... ఇంతకీ మీరేం చేస్తుంటారు?"

"నేనా? నేను కవిని. కవితలు రాస్తుంటా నోయ్" అన్నాడు కాస్త గర్వంగా.

"అవునా? అలాగా సార్" ఆశ్చర్యంగా "మీ పేరేంటి సార్?"

"రమణ' అన్నాడు గర్వంగా.

అక్కడికి తానేదో పెద్ద పేరున్న కవిలాగా బిల్డప్ ఇస్తూ.

"ఓహో. మీరు మా బస్సులో ప్రయాణిం చడం మా అదృష్టం సార్... మీరు నిజంగా చాలా గ్రేట్ సార్. చాలా చాలా గ్రేట్" అన్నాడు డ్రైవర్.

"ఎందుకోయ్?" అన్నాడు రమణ లోలోపల ఒకింత మురిసిపోతూ.

"అంత గొప్ప కవితలు రాయడం మీకే సాధ్యం సార్. అసలు ఎలా రాస్తుంటారు సార్? అలాంటి ఆలోచనలు మీకు ఎలా వస్తాయి అసలు" అని అడిగాడు సందేహంగా డ్రైవర్.

"ఆ ఏముందోయ్ ఏదో అలా కూర్చుని ఆలోచిస్తాను ప్రశాంతంగా. అవే తన్నుకొ స్తాయి" అన్నాడు అంతకంటే ఏమనాలో తెలి యక.

"అదే సార్! ఎలా వస్తాయి ఆ ఆలోచనలు" అన్నాడు మళ్ళీ వదలకుండా పట్టుపట్టి.

'వీడు ఇప్పుడు చెప్తేగానీ వదిలేలా లేదని గ్రహించాడు రమణ.

"ఏముందోయ్ పెన్ను పేపరు పట్టుకుని మొదలెట్టడమే నాపని. అక్షరాలు అలా అలా కాగితం పైన పరిగెడుతుంటాయి వాటంతట అవే" అన్నాడు.

"ఓహో అలాగా! సార్ మీరేవి అనుకోకపోతే మిమ్మల్ని ఓ ప్రశ్న అడగనా?" అన్నాడు సందే హంగా.

"అడగవోయ్. ఏమనుకోనులే" అన్నాడు రమణ చిన్నగా నవ్వుతూ. తనలాంటి పెద్దకవికి ఇలాంటి వన్నీ మామూలే అని లేని గొప్పలను ఊహించుకొంటూ.

"మీరు కవితలు రాసేముందు మందు

కొడతారా?" అనిఅడిగాడు డ్రైవర్ అనుమానంగా.

"అబ్బే! అదీ... అదీ..." అన్నాడు నసుగుతూ.

"పర్వాలేదు చెప్పండి సార్" అన్నాడు డ్రైవర్ సిగిరెట్ వెలిగిస్తూ.

"ఆ... ఏదో కొద్దిగా తీసుకుంటానోయ్. అందువల్ల అక్షరాలు ప్రవాహంలా మదిలోంచి కాగితంపైకి తన్నుకొస్తాయి" అన్నాడు.

"నిజంగా మీరు చాలా గ్రేట్ సార్. అంత బాగా ఎలా రాస్తారో."

"నువ్వు కూడా గ్రేటేనోయ్." అన్నాడు రమణ అంతవరకూ అతని పొగడ్తలకు పడి లేచి.

"నేనా? నేనెందుకని గ్రేట్‌సార్" అని అడిగాడు డ్రైవర్ ఆశ్చర్యంగా.

"ఎందుకు కాదు. ఇంత పెద్దరోడ్డుమీద ఇంత బస్సుని ఇంత వేగంగా నడపడం అంటే మాటలా? నాలాంటి వాడికి ఓ స్కూటర్ నడపడమే సర్కస్‌లో విన్యాసంలా అనిపిస్తుందోయ్. అలాంటిది ఇంత పెద్ద బస్సుని అవలీలగా నడుపుతున్నందుకు నిజంగా నువ్వు చాలా గ్రేటేనోయ్."

"చాల్లే ఊరుకోండి సార్. మీరు మీ జోకులు. నేను స్టీరింగు ముందు కూర్చుని బస్సు స్టార్ట్ చేసానంతే. టైర్లు వాటంతట అవే పరుగులు తీస్తాయి." అన్నాడు గర్వంగా.

"అందుకే నువ్వు చాలా గ్రేట్. అవును నీకు మందు లవాటుందా?" అని అడిగాడు చొటగా.

"అదీ... అదీ..." అంటూ నసిగాడు డ్రైవర్.

"ఏం పర్లేదులే చెప్పు. మనలో మనకు మొహమాటమెందుకు?"

"ఆ... ఏదో కొద్దిగా...వుంది సార్."

"కొద్దిగా అంటే? ఎప్పుడు వేస్తావు? ఇప్పుడు కాని వెయ్యలేదు కదా" అని మనసులో అనుకుంటూ.

"ప్రతిరోజు కొద్దిగా వేస్తాను సార్. కొద్దిగా అంటే ఒక హాఫ్ బాటిల్ సార్" అన్నాడు నవ్వుతూ.

"ఓర్ని నువ్వు అసాధ్యుడిరోయ్' అనుకున్నాడు రమణ?


"నేను మందు వేయకుండా బస్సు నడిపానంటే ఆ రోజు కచ్చితంగా ఏదో యాక్సిడెంట్ జరిగితీరుతుంది సార్" అన్నాడు డ్రైవర్ అసలు విషయం చెప్పేసి.


"అవునా? చంపావు కదయ్యా. ఇంతకూ ఈ రోజు మందు వేసావా లేదా?" అన్నాడు కంగారుగా కవి.

ఎదురుగా లారీ వస్తుంది. దాన్ని తప్పించేందుకు విశ్వప్రయత్నం చేసి విఫలమైనాడు.

నీ నవ్వు బంగారంగానూ...







నవ్వుల రారాజు



ఫ్లాష్‌బ్యాక్

చార్లీచాప్లిన్ ద గ్రేట్!

విష్ణుభొట్ల రామకృష్ణ

ఫోన్: 9 4 4 0 6 1 8 1 2 2

ఈనాడు పెద్ద పెద్ద హీరోలు, హీరోయిన్సులకు ఏ విధంగా అభిమాన సంఘాలు వున్నాయో అదేవిధంగా చాప్లిన్‌కు అభిమాన సంఘాలు పుట్టాయి.

నేటితరం అభిమానుల్లో నిలువెత్తు కటౌట్ అవట్లు, పాలాభిషేకాలు, వంటి పనులే కాక పుస్తకాల షాపులకు, మంగలి షాపులకు వైన్ షాపులకు అభిమాన హీరో, హీరోయిన్ పేర్లు పెట్టుకొంటున్నట్లు ఆనాడు చార్లీచాప్లిన్ అభిమానులు తమ మందుల షాపులకు పుస్తకాల షాపులకు, బట్టల షాపులకు, సిగిరెట్ కంపెనీలకు చార్లీచాప్లిన్ పేరు పెట్టుకొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అదేవిధంగా వారి ఉత్పత్తులకు చార్లీచాప్లిన్ పేరుతో పాటు ఆయన ఫోటోను ముద్రించటం వల్ల వారి వ్యాపారం రెట్టింపు అయ్యాయి. దీనికి ఉదాహరణే చాప్లిన్‌కు ఆయన అభిమానులు పందల వేల సంఖ్యలో ఉత్తరాల ద్వారా తమ అభిమానాన్ని తెలిపేవారు.

ఈనాడు అభిమానులు ట్విట్టర్, ఫేస్‌బుక్, మెయిల్స్ ఎలా ఉపయోగిస్తున్నారో ఆ విధంగా అన్నమాట.

ఇలా చాప్లిన్ సినిమాల్లో బిజి అవుతూ. మరోపక్క అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించసాగాడు.

ఒకవైపు అభిమానులు... మరోవైపు సినిమాలు విజయవంతం అవటం ఈ రెండింటితో పాటు ఊహించని రీతిలో ఎవరు పొందని పారితోషికం లభించటం. చాప్లిన్ జీవితంలో ఒక మలుపుగా చెప్పవచ్చు.

ఒక విధంగా నేడు మన హీరోలు ఒకటి రెండు హిట్స్ వస్తే ఏ విధంగా తమ పారితోషికాన్ని పెంచుకొంటారో అదే విధంగా. కాని చాప్లిన్ విషయంలో అది రివర్స్ అయింది.

ఎలాగంటే ఆయన చిత్రాలు విజయవంతం కావటంతో చిత్రనిర్మాతలు తమంతట తామే చాప్లిన్‌కు పారితోషికం పెంచసాగారు. దీనితో పాటు సినిమా హాళ్ళలో సీట్లసంఖ్యను పెంచటం ద్వారా సినిమా కంపెనీలు లాభాలు గడించసాగాయి.

ఇది ఒకరకంగా చాప్లిన్ ఆనాడు సినిమా రంగంలో తనదైన నటనాశైలిని చూపి కంపెనీలకు లాభాలను గడింపచేశాడు.

చాప్లిన్ సినిమా రంగంలో అగ్రశ్రేణి తారగా వెలుగొందాడు. ఆనాడు సినిమాల్లో నటించిన నటులలో ఎవరూ తీసుకోని పారితోషికాన్ని తీసుకున్నాడు.

ఎస్సనీ కంపెనీ ఏజెంట్ ఒక్కొక్క చిత్రానికి పదివేల డాలర్లు బోనస్‌గా ఇస్తానని ముందుకొచ్చాడు కాని చాప్లిన్ అంగీకరించలేదు. పారితోషికం తక్కువ అయిందని చాప్లిన్ అంగీకరించటం లేదని భావించిన ఎస్సనీ



చాప్లిన్‌తో మరో ఒప్పందం చేసుకోవటానికి ముందుకు వచ్చింది. అదేమిటంటే 12 రీళ్ళ చిత్రాలలో నటిస్తే మూడు వందల యాభైవేల డాలర్లు బోనస్ ఇస్తానని ప్రతిపాదించాడు ఎస్సనీ కంపెనీ ప్రతినిధి.

ఆ ప్రతిపాదనకు సరేనని ఒప్పుకొన్నా చాప్లిన్ ముందుగా నూటయాభై వేల డాలర్లు ఇవ్వమన్నాడు. ఆ ప్రతిపాదనకు ఎస్సనీ కంపెనీ ఒప్పుకోక పోవటంతో అతనితో కాంట్రాక్టుకు అంగీకరించలేదు.

ఒక విధంగా చెప్పాలంటే చాప్లిన్ జీవితంలో ఇది ఊహించని విజయం. వరుస చిత్రాల విజయపరంపర. వద్దు అన్నా ఊహించని డబ్బు, అభిమానుల అభిమానంతో చాప్లిన్ ఉన్నతస్థితిలోకి వెళ్ళాడు.

తెలియకుండానే చాప్లిన్ ప్రజల గుండెల్లో గొప్పస్థానం సంపాదించాడు అని తెలుపటానికి ఈ సంఘటన ఓ ఉదాహరణ మాత్రమే.

ఒకనాడు చాప్లిన్ న్యూయార్క్‌కు ఐదు రోజుల ప్రయాణం పెట్టుకొని బయలుదేరాడు. ఆయన ప్రయాణించిన దారిలో ప్రతి చిన్న, పెద్దరైల్వేస్టేషన్స్‌లో వేలాదిమంది అభిమానులు ఆయన్ని చూడటానికి, ఆయనతో మాట్లాడటానికి, సన్మానాలు చేయటానికి పోటీపడ్డారు.

ఎంతోమంది ధనవంతులు ఆయన్ని సన్మానించటానికి పోటీపడసాగారు. ఆయన ప్రయాణాన్ని తమ ఊరిలో కొనసాగించమని తాము ఇచ్చే సన్మానాన్ని అమోదించమని పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు సైతం టెలిగ్రాములు పంపేవారు. కానీ వాటిని వేటినీ చాప్లిన్ అంగీకరించలేదు. సున్నితంగా త్రోసిపుచ్చాడు. కారణం సహజంగానే పిరికివాడు కావటం ఒక కారణం అయితే చాప్లిన్ ఎప్పుడు ఒంటరిగా వుండటానికీ ఇష్టపడటం కూడా ఒక కారణం.

ఆ ఒంటరితనమే అతని పాలిట అదృష్టం. వరంకూడ.

చాప్లిన్‌కు వందలవేల మంది అభిమానులు వున్నా, లక్షలకు లక్షలు డబ్బులు సమకూరినా ఏనాడు ఎటువంటి వ్యాపారాలు చేయలేదు. అస్సలు వ్యాపారం చేసి అభిమానులను మోసగించి, తనపేరు ఉపయోగించుకొని డబ్బు సంపాదించుకొనే మార్గాన్ని చాప్లిన్ ఏనాడు



అవలంబించలేదు.

బెల్లం వుంటే దానిచుట్టూ చీమలు చేరుతాయి అన్నట్లు చాప్లిన్‌కు సినిమా రంగంలో అగ్రశ్రేణి నటుడుగా మారటం, డబ్బు, కీర్తి ప్రతిష్ఠలు రావటంతో చాలామంది అతనికి దగ్గరకావటం మొదలెట్టారు. కొంతమంది అతని స్నేహాన్ని కోరుకొని, కొంతమంది అతనితో వ్యాపార లావేదేవీలు పెట్టుకొనేందుకు ముందుకొచ్చారు.

దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి అన్నట్లు మంచిపేరు ప్రతిష్ఠలు పుష్కలంగా డబ్బు వున్నప్పుడే వ్యాపారం వంటివి చేసుకొని నాల్గు రాళ్ళు వెనకేసుకోవాలి అనే అనేకమంది మిత్రులు సలహాలు ఇచ్చారు.

కాని చాప్లిన్ ఏ వ్యాపారం వైపు వెళ్ళలేదు. ఇలాఉప్పెనలా తన సినిమా విజయపరంపరలు, ఈ డబ్బు చాప్లిన్‌కు వింత అనుభూతిని కొత్త భయాన్ని తెచ్చాయి. ఈ విపరీత పరిణామం చివరకు తనను ఏ దారిన తీసుకు వెళతాయో అని అప్పుడప్పుడు భయపడేవాడినని తన ఆత్మకథలో రాసుకున్నాడు. అలాగే తాను గనుక తన సంపాదనతో ఏదైనా వ్యాపారం చేసినా లేక ఎక్కడైనా పెట్టుబడులు పెట్టినా కోట్లు సంపాదించేవాడిని. కాని తనకు అటువంటి ఆలోచనలు లేవని తన జీవిత చరిత్రలో రాసుకొన్నాడు.

డబ్బుకోసం, పేరుకోసం, సన్మానాలకోసం చాప్లిన్ ఏనాడు ఆశించలేదు. వాటికొరకు తపించలేదు. హాస్యనటునిగా తనకంటు గుర్తింపుకోసం పరితపించాడు. కష్టపడ్డాడు. విపరీతమైన శ్రమపడ్డాడు.

డబ్బు తన ధ్యేయం అని అనుకొని వుంటే పెద్ద పెద్ద కంపెనీల వారితో ఎన్నో కాంట్రాక్టులు కుదుర్చుకొని,డబ్బు సంపాదించేవాడు. ఆ డబ్బును రకరకాల వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి కోటీశ్వరుడయ్యేవాడు. కాని అతనికి డబ్బు కీర్తి, ప్రతిష్ఠలు అన్ని తను నమ్ముకొన్న పాత్ర ద్వారానే అతన్ని వెతుక్కుంటూ వచ్చాయి.

అందుకోసమే చాప్లిన్ డబ్బువైపు పయనించలేదు. కీర్తిప్రతిష్ఠలు శాశ్వతం కాదని ఎప్పుడూ ఏ పరిస్థితి వస్తుందో అని ఆందోళన పడేవాడు. ఏ పరిస్థితినైనా స్వీకరించటానికి సంసిద్ధుడయ్యాడు. (సశేషం)

పసుపులేటి సుధారాణి

లాఫింగ్ జర్నీ



సౌచాలయ్

మా అన్నయ్య వాళ్ళు వుండేది భద్రాచలం దగ్గిర మణుగూరులో.

ఈ మధ్య వాళ్ళ కుటుంబం మొత్తం మమ్మల్ని చూసినట్లు వుంటుంది, కనకదుర్గమ్మ వారి దేవాలంలో వాళ్ళ మొక్కులు తీర్చుకుంటు న్నట్లుంటుంది అని విజయవాడ వచ్చారు.

తిరిగి వెళ్ళేటప్పుడు నన్నుకూడా వాళ్ళ వూరు రమ్మని అడిగింది వదిన. వెళ్ళి చాలా కాలమైంది కదా అని ఆఫీసుకి సెలవు పెట్టి మరీ బయల్దేరాను.

బస్సు ప్రయాణం అంటే ఎంచక్కా ఆప కుండా వాంతులు చేసుకోవచ్చని సంబర పడిపోయే వదిన ఆరోగ్యాన్ని తట్టుకోలేని అన్నయ్య రైలులో వెళదామని చెప్పడంతో అందరం ఉదయం ఎనిమిది గంటలకు బయలుదేరే కొత్తగూడెం ప్యాసింజర్‌లో వెళ్ళ దానికి ఏడున్నరకల్లా రైల్వేస్టేషన్‌కి వెళ్ళి టిక్కెట్లు తీసుకుని ఆ ట్రైన్ ఆగివున్న ప్లాట్‌ఫాం మీదికి వెళ్ళి అక్కడ సిద్ధంగా వున్న రైలు ఎక్కి సీట్లు చూసుకుని కూర్చున్నాము.

ఎనిమిది గంటలకి బయలుదేరింది ట్రైను.

మేం మొత్తం పిల్లలు, పెద్దలు కలిపి ఆరు గురము వుండటంతో ఎదురెదురుగా వున్న సీట్లు చూసుకుని రెండు వరసల్లో కూర్చు న్నాము. ఆ తర్వాత ఎవరో ఇద్దరు భార్యా భర్తలు వచ్చి కొద్దిగా స్థలం ఇవ్వమని అడిగితే మేం సర్దుకుని కూర్చుని వాళ్ళకి కూర్చునేం దుకు స్థలం ఇచ్చాము.

అతని ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవటం చూసి అతనికి కాస్త ఎక్కువ స్థలం వదిలి పెట్టాము.

రైలు మధిర స్టేషన్‌కి వచ్చేటప్పటికి దిగే జనం కంటే, ఎక్కే జనం ఎక్కువ కావటంతో ఎనిమిదిమంది మాత్రమే కూర్చోగలిగిన రెండు బెర్తులలో పదకొండుమంది కూర్చోవడమే కాదు, కొంతమంది మగవాళ్ళు పై బెర్తలపైకి కూడా ఎక్కి కూర్చుని ఎదురు బెర్త్‌పై కాళ్ళు చాపిపెట్టి కులాసాగా కూర్చుని కింద బెర్తలపై కూర్చున్న మమ్మల్ని నానా చికాకు పరుస్తు న్నారు.



మధిర స్టేషన్‌లో ఇద్దరు తల్లీ కూతుళ్ళు ఎక్కారు. ఆ ఇద్దరిలో తల్లి చాలా లావుగానూ, కూతురు ఒక మోస్తరుగానూ వున్నారు. వాళ్ళిద్దరూ రైలు ఎక్కిన దగ్గిర్నించీ మా వైపే చూస్తున్నారు. వాళ్ళ చూపులకు అర్థమేమిటో మాకు అర్థమయినా అప్పటికే పదకొండు మంది కూర్చున్న ఆ బెర్తలలో వాళ్ళకు స్థలం ఇచ్చే అవకాశం లేనందువల్ల యేమీ చేయలేక పోయాం.

చూసీ చూసీ ఆ తల్లి ఇక లాభం లేదను కుంది కాబోలు, సన్నగా వుండే మా మేనల్లుణ్ణి కొద్దిగా జరగమని చెప్పింది. వాడు మా మొహా లకేసి చూశాడు.

మేమేం అనకముందే ఆవిడ, "కొద్దిగా జరుగు బాబూ! సర్దుకుని కూర్చోవాలి" అని మా మేనల్లుణ్ణి జరిపేసి తపీమని సీట్లో కూర్చుండిపోయింది. ఆమెకు అటుపక్కన అనారోగ్యంతో వున్న పేషెంటు, యిటుపక్క మా పిల్లలిద్దరు బిక్కమొహాలు వేసుకుని ముడు చుకుని కూర్చున్నారు.

అంతటితో ఊరుకోని ఆమె "మానవత్వం వుండాలండి. పోయినసారి ఒక పిల్లతల్లికి కూర్చునే చోటు లేకపోతే నేను నిలబడి ఆమెకు సీటు ఇచ్చాను" అంది.

వెంటనే ఆవిడగారి కూతురు అందుకుని "రైలు ఏదో వీళ్ళ సొంతమైనట్లో, లేకపోతే రిజర్వేషన్ చేయించేసుకున్నట్లు సీట్లన్నీ ఆక్ర మించుకుంటారు. అదేమంటే పేషెంట్ అంటూ వంకలు చెపుతారు. కాసేపట్లో దిగి పోయేవాళ్ళం, దీనిక్కూడా కొంచెం సర్దుకు పోలేరు. ఇందాకట్నించీ చూస్తున్నాను మా అమ్మకి సీట్ ఇస్తారేమో అని. కొంచెం కూడా ఆ ఆలోచనే లేదు వాళ్ళకి..." అంటూ అప్పుడే లేచి నుంచున్న అన్నయ్య కూర్చున్న చోటు ఖాళీ అవడంతో ఆమె గబుక్కున కూర్చోబోయి ఆ పక్కనే వడిలో పసిబిడ్డతో కూర్చునివున్న ఒక బడుగుజీవిని చూసి ముఖం చిట్లించి అలాగే నిలబడిపోయింది.

కూర్చోనే శక్తికూడా లేని అనారోగ్యంతో వున్న ఒక వ్యక్తికి మా పిల్లని వళ్ళో కూర్చో పెట్టుకుని కొంచెం విశ్రాంతిగా వుంటుందని ఎక్కువ స్థలం ఇచ్చిన మా మానవత్వం, ఆ స్థలాన్నే కాకుండా పసిపిల్లలను సైతం తోసేసి సీట్లో మూడొంతుల స్థలాన్ని ఆక్రమించుకుని కూర్చున్న ఆ తల్లి మానవత్వం ముందు తలవంచింది మరి!

ఇంతలో మా పక్కన కూర్చున్న పసిపిల్ల తల్లి, తన ఒళ్ళో కూర్చునున్న ఏడాది కూడా నిండని చిన్నపిల్లాడ్ని కిందకు దింపింది.

మరుక్షణంలో ఆ కూతురు "ఏమ్మా! పిల్లా డితో పాస్ పోయించేస్తున్నావు. నా కాలి కిందకు వచ్చేస్తున్నాయి.నీ పిల్లాడు నీకు ముద్దు కాని అందరికీ కాదు.... బాత్‌రూమ్‌కి తీసికెళ్ళి పోయించలేవా?" అంటూ గయ్‌మంది.

అంతే!


"ఓసోస్! ఇందాకట్నించి సూత్తన్నాను. ఒకటే పేలిపోతన్నావు. మానవత్తం అంట, సర్దుకు పోవాల్నట. ఇంకా ఏదేదో అనేత్త న్నావు. కాలుపెట్ట సందుకూడా లేని ఈ పెట్టె లో పిల్లగాణ్ని మరుగుదొడ్డికి ఎట్టా తీసికెల్ల మంటావు తల్లీ! పిల్లగాడి ఒంటేలు వచ్చింది కాలికిందకే కాని, నీమీద పడలేదుగా! దానికే చిరాకు పడిపోతన్నావు. ఆ ముసలాయన్ని రోగం అని వంక పెట్టాదన్నావు! అందర్నీ సర్దుకుపోవాలన్నావు. మరి నువ్వు చేసేదే మిటి? నువ్వేం సర్దుకుపోతున్నావు? ఆ బాబుగారు చోటివ్వబట్టే మేమందరం ఇలా కూకున్నాము. చోటిచ్చి వాళ్లంతా చూడు ఎలా యిరుక్కుని కూకున్నారో! ఇంకెప్పుడూ మాన వత్తం, సర్దుబాటు లాంటి పదాలు నువ్వు మాట్టాడక తల్లీ! ఆ పదాలు సిగ్గుపడి పోతాయి...." అంటూ అన్నయ్యని చూపిస్తూ ఆ కూతుర్ని దులిపి పారేసింది ఆ బడుగుజీవి.


ఆ బడుగుజీవి వాగ్ధాటికి ముఖాలు నల్ల బడగా తలవంచుకుని ఖమ్మం స్టేషన్‌లో దిగి పోయారు ఆ తల్లీకూతుళ్ళు.

అప్పుడనిపించింది నీతులు చెప్పడం తేలికే కాని వాటిని ఆచరించటం చాలా కష్టం అని, తనదాకా వస్తే కాని తెలియదనీ.

చూడు చూడు లోకం...







పాతతరం హాస్యాన్ని ఈ తరం వాళ్ళకి పరిచయం చేయడమే ఈ నాటి నవ్వులు...

నాటి నవ్వులు

పాపం... మగవాళ్ళు!

-శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి

పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నాడు మహాకవి మరి! మిగతా పురుషుల సంగతి మనం ఆలోచించవలసిన విషయమే.

అవును! నిజంగానే పాపం ఈ మగవాళ్ళని చూస్తే జాలి వేస్తుంది. అన్నీ తమకే తెలుసు ననుకొని గర్వంగా కాలరు ఎగరేసుకుని తిరుగుతూ వుంటారు.

"కాదు మనకి చాలా విషయాలు తెలియవు" అని వాళ్ళు తెలుసుకుంటే ఎంత బాగుండును! ఈ సంగతి వాళ్ళకి తోచదు. ఆడవాళ్ళు చెబితే వినరు.

"ఆ... ఆడవాళ్ళు చెబితే మనం వినడమా" అనే పౌరుషం ఒకటి.

నిజానికి ఆడవాళ్ళ సలహాలు లేందే వాళ్ళు ఏ పని చెయ్యగలరు. ఆఖరుకి ఏ పేంట్‌మీద ఏ షర్టు మేచ్ అవుతుందో అనే చిన్న విషయం దగ్గర్నుంచి, పిల్లలకి ఏ 'మేచ్' నిర్ణయం చేద్దాము అనే విషయం దాకా అన్ని సందర్భాలలోనూ పురుషునికి స్త్రీ సలహా వుంటూనే వుండాలి.

సమయానికి సరియైన సలహా ఆడది ఇవ్వక పోయినా, లేదా తీసుకోడానికి మగవాడు పౌరుషపడినా, ఆ పని అంతంత మాత్రంగానే కనిపిస్తుంది.

అయినా, అనవసరంగా పౌరుష పడడమే కాని, స్త్రీయొక్క ఆలంబనం లేకుండా, పురుషుడికి ఒక్కక్షణం గడుస్తుందా అని.

నాలుగైదేళ్ళు వచ్చేదాకా జాగర్తగా లాలిస్తూ కబుర్లు చెబుతూ బువ్వపెట్టి జోకొట్టకపోతే, ఏదో తిక్కపేచీ పెట్టుకుని అన్నమూ తినకుండా, సరిగా నిద్రపోకుండా, నానా అవస్థా పడతాడు, పాపం పసివాడు.



ఆ తర్వాతకూడా, అతనికి చెల్లెలు రూపంలోనో అక్కరూపంలోనో ఆడది సహాయం చేస్తూనే వుండాలి.

పదిహేనేళ్ళు ఇరవై యేళ్లు వచ్చినా అతనికి పాపం పదేళ్ళ ఆడపిల్లకి వుండేపాటి గడుసుతనమేనా వుండదు. తనసుఖం తనకి అర్థం కాదు. ఏదో వెర్రివాడిలా బతికేస్తూ వుంటాడు.

"ఇంకా బట్టలు మాసిపోయాయి. చాకలికి వెయ్యి" అనో, "నీ నోట్సు ఆ అబ్బాయికి యిస్తానంటున్నావు. పరీక్షలలో మరి నీకో? వెతికాను కాని,కనిపించలేదు అని చెప్పిపంపెయ్యి" అనో, "అదేం కలరురా? అది నీకు బాగుండదు. ఈ షర్టింగు తీసుకో" అనో, అహరహమై దగ్గర వుండి చెపుతూ వుండాలి.

ఈ పని అయిదేళ్ళ చెల్లెలయినా చెయ్యగలదు కాని, ఇరవైఏళ్ళు వచ్చినా పాపం ఆ అబ్బాయి తనకి ఏది బాగుంటుందో తెలుసుకోలేడు. తన బాగోగులు తను చూసుకోలేడు.

షర్టింగు ఎన్నుకోవడంలోనే కాదు, సతీమణిని ఎన్నుకోవటంలో కూడా ఏ అక్కచెల్లెలు లాంటి వ్యక్తో అతనికి సహాయం చెయ్యాలి.

పెళ్ళిచూపులికి వెళ్ళినప్పుడు, అలాంటి ఏ అక్కయ్యనో చెల్లెల్నో తనతో తీసుకువెళ్ళితే, అతను జీవితాంతం సుఖపడిపోతాడు.

"ఈ అమ్మాయి నీకు బాగుంటుంది" లేక "బాగోదు" అనే సంగతి తక్కున గ్రహించి చెప్పేస్తుంది ఆమె. అలా సూక్ష్మంగా గ్రహించి చెప్పగలిగే నేర్పు ఆమెకి వుంటుంది.

అలాకాదని, తను ఒక్కడే వెళ్ళి పెళ్ళిచూపులు చూసుకుని వచ్చాడో, తప్పకుండా నష్టపోతాడు. రెండుజడలు వేసుకోలేదనీ, కాస్త చాయ తక్కువనీ, శుభ్రమైన పిల్లని కాదని రావడమో, ఓ చిరునవ్వు విసిరిందని వన్నెల విసనకర్రని ఎన్నుకోడమో చేస్తాడు.

ఆమె విలాసాలూ వయ్యారాలూ చూసి

ముగ్ధుడైపోతాడు. కాని, ఈమె అనుకూలవతి యైన భార్య అవుతుందా కాదా, ఈమె వల్ల నా జీవితం నరకం అవుతుందా స్వర్గం అవుతుందా అని ఆలోచించడు.

అసలా మాటకొస్తే ఆలోచించలేడు.

ఆలోచించే శక్తి అతనికి వుండదు. ఇలాంటి విషయాల్లో సూక్ష్మ గ్రహణ పారీణత స్త్రీల కున్నంతగా పురుషులకు వుండదు.

యువతీ యువకుల ప్రేమల్లో కూడా అబ్బాయిని అమ్మాయి వల్లో వేసుకోవడం చూస్తూ వుంటాము. కాని సాధారణంగా అబ్బాయి ఆ విధంగా అమ్మాయిని ఆకర్షించలేడు. తలుచుకుంటే ఎంతటి అసమానుడైన యువకుని అయినా ప్రేమించి తెలివిగా తనవాడిని చేసుకొంటుంది అదది.

కాని పురుషుడు, ఇష్టం లేని స్త్రీని ఎన్ని తెలివి తేటలు ఉపయోగించి అయినా తన దానినిగా చేసుకోలేడు.

ప్రపంచంలో మనకి కనిపించే ప్రేమ వివాహాల్లో నూటికి తొంభై, స్త్రీ చాకచక్యం, అన్నివిధాలా యోగ్యుడైన పురుషుని ఆమె తన కైవశం చేసుకోవడమే కనిపిస్తుంది. అంటే తన జీవిత భాగస్వామిని ఎన్నుకోవడంలో స్త్రీయే పురుషుని కంటే తెలివైనదన్నమాట!

అందుకే ఈ ఎన్నుకోవడంలో అతడు ఏ చెల్లెలి సహాయాన్నో, అక్కగారి సలహానో తీసుకుంటే కొంతవరకూ తన బ్రతుకుని స్వర్గం చేసే స్త్రీని సంపాదించుకోవచ్చు.

ఇలా పసితనంలో తల్లి ఆలంబనా, ఒక వయస్సు వచ్చేదాకా సోదరీమణుల సహాయం పొందితే, ఇంకా తరువాత ఆ పెద్దమనిషి బాగోగులు వచ్చిన 'అమ్మ'గారే చూసుకుంటారు.

భార్య అనుక్షణమూ ఆదుకొని సంరక్షించక పోతే, నూటికి డెబ్భై ఎనభై మంది భర్తలు భయంకరమైన పరిస్థితులకు గురికావలసి వస్తారు. అయితే దూబరా చేస్తారు. లేదా పిసినిగొట్టులుగా తయారవుతారు.

"అయ్యో పాపం!" అంటూ ఇతరులకి అప్పులైన ఇస్తారు కాని వాస్తవాన్ని తెలుసుకొని మసులుకోరు. సరికదా, త్యాగాలూ, ఆదర్శాలు అంటూ ఏవో ఉపన్యాసధోరణిలో వుండడమే కాని, వాస్తవాన్ని తెలుసుకొని మసలుకోరు.

కొందరు పురుషులకైతే ఆఫీసులో ఎలా



మసులుకోవాలో కూడా చెప్పాలి ఆడవాళ్ళు.

"మీకు అసలే కోపం. ఆఫీసరు ఓమాట అంటే అన్నాడు. ఆయన్ని ఎదిరించకండి" అనో, "మరీ బుర్ర అడించి రాకండి" అనో, 'అతను ఎందుకన్నాడో! ఆ మాత్రం అర్థం చేసుకోలేమిటండీ" అనో, "పక్కవాళ్ళని చూడండి, వాళ్ళు ఎలా వున్నారో" అనో అస్తమానూ అతన్ని రిపేరు చేస్తూ, పట్టాలనుంచి తప్పిన రైలుని, పట్టాలమీదికి తిరిగి చేర్చినట్లు, అతణ్ణి సక్రమమైన మార్గంలోకి తెస్తూవుండాలి.

కొందరు ఆఫీసర్లయితే పూర్తిగా భార్య సలహామీదే నడుచుకొంటూ వుంటారు.

కొన్ని జిల్లాల్ని, జిల్లా అధికారుల భార్యలే పరోక్షంగా పరిపాలిస్తూ వుంటారు.

"ఆఫీసర్ల అంకుశాలు అంతఃపురాల్లో వుంటాయి"అనే మాట వూరికే పుట్టింది కాదు.

కొందరి పురుషులకైతే, "మీరు కాఫీ తాగే వేళైందండీ", "మీరు ఇవాళ కిటికీలు తీసుకొని పండుకోకండి జలుబు చేస్తుంది", "మరికొంచె అన్నం వేసుకోండి"వంటి చిన్న విషయాలు కూడా చెప్పాలి. వాళ్ళు బొత్తిగా శరత్ నవలల్లో నాయకులులా వుంటూ వుంటారు పాపం!

కావ్యాలు పరిశీలించినా మనకు ఈ సత్యం గోచరిస్తుంది.

నరకాసుర సంహారానిక "కాదూ కూడదు మీకు తెలియదు నేనూ వస్తానం"టూ సత్యభామకూడా కృష్ణుడితో బయలుదేరి వెళ్ళింది కనకే, అప్పుడా మర్యాద కృష్ణుడికి అలా దక్కింది.

అలాగే కైకేయివల్ల దశరథుడికీను, సీత రాముడితో వాదించి అరణ్యాలకి అతనితో వెళ్ళక పోయినా, ద్రౌపది పాండవులకు కర్తవ్యోన్ముఖునుల్ని చెయ్యక పోయినా, దుష్టశిక్షణ జరిగివుండేది కాదు.

ఇంతెందుకు? స్వయంవరాలనేవి స్త్రీలకి వుండేవి కాని పురుషులకి వుండేవా? ఎందువల్ల?

స్త్రీకి అనుకూలుడైన పురుషుని ఎన్నుకొనే తెలివీ ఆలోచనా వుండేది. అందుకే ఆమెకి స్వయంవర అవకాశం ఇచ్చేవారు.

ఒకవేళ ఆ అవకాశం పురుషుడికి కూడా ఇచ్చినా అతను సమర్థంగా ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని వుండేవాడా లేదా అన్నది అనుమానాస్పదమైన విషయమే!

ఏమైనా సగటున స్త్రీకి వున్న గడుసుదనం, లోకజ్ఞత పురుషుడికి వుండదు.

ఈ సత్యం చెబితే చాలామంది మగవాళ్ళు అంగీకరించరు. సరికదా కోపం వస్తుంది కూడా.

అందుకే అన్నాడు ఒక ఆంగ్ల రచయిత-

ఓర్పయిన ఆడవాళ్ళు వుండబట్టే మగవాళ్ళకి కోపం ఎక్కువ అయింది అని. అందుకే అనిపిస్తుంది పాపం అని...

(ఆకాశవాణి సౌజన్యంతో)



సండే ఫోబియా

కథ

బండి రవీందర్

గుర్నాథం శనివారం సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి బయలుదేరాడు.

ప్రభుత్వ కార్యాలయములో క్లర్కుగా పని చేస్తున్నాడు. రోజంతా ఆఫీసులో ఫైళ్ళతో కుస్తీ పట్టడం అలవాటుగా మారింది.

ఇద్దరు ముగ్గురు క్లర్కులు చేసేపని ఒక్కడే చేయాల్సి వస్తుంది ఆఫీసులో. ఖాళీ అయిన పోస్టులు తిరిగి నింపకపోవడంతో ఇబ్బందిగా వుంది. అయినా ఎప్పుడూ భారంగా ఫీల్ కాక పోవడం గుర్నాథం ప్రత్యేకత.

కాని సాయంత్రం నుండి ఎందుకో అనీజీగా మెదడంతా మొద్దుబారినట్లు, ఊపిరి ఆడనట్లు, ఒళ్ళు వేడెక్కడం. వణకడం... ఏదో... ఏదోలా వుంది గుర్నాధానికి.

ఎలాగోలా బైక్‌పై సత్తువ కూడగట్టుకుని ఇల్లు చేరాడు.

కొత్తగా కట్టుకున్న ఇంటి కాలింగ్‌బెల్ నొక్కాడు.


భార్య చామంతి నవ్వుతూ డోర్ తెరవ బోయి, గుర్నాథం అవతారాన్ని చూసి ఉలిక్కి పడింది.

"ఏంటండీ! ఏమైందండీ!! అంతలా వణుకు తున్నారు... అయ్యో ఒళ్ళుకూడా కాలి పోతుందే..." అంటూ మెల్లిగా నడిపించు కుంటూ ఇంట్లోకి తీసుకెళ్ళింది.

"ఉదయం నుండి బాగానే వున్నాను. సాయంత్రం నుండే ఎందుకో ఇలా అవు తుంది" అంటూ ఓపికలేక హాల్లోని సోఫాలోనే కూలబడ్డాడు.

చామంతికి ఎప్పుడూ హుషారుగా వుండే గుర్నాధాన్ని ఇలా చూసేసరికి కాళ్ళూ చేతులూ ఆడటంలేదు.

"అయ్యో!... నాకు భయంగా వుందండీ" అంటూ ఏడవటం మొదలెట్టింది బిగ్గరగా.



అప్పుడే స్కూలునుండి ఆటో దిగిన పిల్లలి ద్దరూ ఇంట్లోకొచ్చి ఈ సీను చూసి ఏదో అయ్యిందని చామంతితో పాటు–

"నాన్నా! నాన్నా!" అంటూ బిగ్గరగా ఏడ వటం ప్రారంభించాడు.

ఈ ఏడుపులకి గుర్నాధానికి చిరాకేసి "ఇక చాల్లెండి... ఏడ్వటం...నేనింకా బ్రతికే వున్నా నుగా. ఇంకా పోలేదుగా" అని కసురు కున్నాడు.

"ఒక టీ.వి. సీరియల్‌లో హీరోయిన్ ఇలానే ఏడ్చిందండీ! వెంటనే భర్త హరీమన్నాడు. మీరు నిజంగా పోతే నేనేడ్చింది మీకు ఎలా తెలుస్తుందండీ... అందుకే ఎందుకయినా మంచిదని ముందే ఏడుస్తున్నానండీ" అంటూ లబోదిబోమంది.

వెంటనే ముక్కు చీదుకుంటూ లేచి, టక్కున గుర్తుకొచ్చి పూజగదిలోకి వెళ్ళి ఫకీరు సాహెబ్ దగ్గరనుండి తెచ్చిన తాయెత్తుల్లో ఒకటి తెచ్చి గుర్నాథం నడుముకు బలవంతంగా కట్టింది.

ఈ పనితో గుర్నాధానికి చిర్రెత్తుకొచ్చింది.

"ఇంకా నీకీ తాయెత్తుల పిచ్చిపోవడం లేదు. ఇప్పటికే మనకు మంచి కాలనీలో ప్లాటు దొర కాలని నా ఎడమచేతికి, మంచిఇల్లు కట్టుకోవా లని నా కుడిచేతికి కట్టావ్. ప్రమోషన్ త్వరగా రావాలని నా మెడకూ తాయెత్తు కట్టావ్! పిల్ల లకు మంచిగా చదువు రావాలనే వారికి తాయె త్తులు కట్టావు." అంటూ చామంతిపై అరిచాడు గుర్నాథం.

"అయ్యో! అలా తిట్టకండీ! టి.వి.లో మంత్రాల మర్రిచెట్టు సీరియల్‌లో ఇలానే తాయెత్తులు కడితే హీరోయిన్ కోరికలన్నీ తీరా యండీ" అంటూ ఆశగా చెప్పింది చామంతి.

రాత్రి 8 గంటలయింది.


తాయెత్తు కట్టినా గుర్నాథంకు ఏ మాత్రం ఆరోగ్యం కుదుటపడకపోయేసరికి, ఆటోలో దగ్గర్లోనే ఉన్న డాక్టర్ పశుపతినాథ్ వద్దకు తీసుకెళ్ళింది గుర్నాధాన్ని.

డాక్టర్ పశుపతినాథ్ తన క్లినిక్‌లో వున్న అన్ని రకరకాల టెస్టులు, స్కానింగ్‌లు, ఎక్స్ రేలు అవసరం వున్నా లేకున్నా చేసి గుర్నాథం జేబులోని మూడువేల రూపాయలు లాక్కు న్నాడు. సారీ... బిల్ వేశాడన్నమాట.

రిపోర్టులు అటూ యిటూ పరిశీలించి,

కాసేపు మౌనంగా ఆలోచించి, కొంతసేపు అవీ ఇవీ అన్ని కబుర్లు మాట్లాడుతూ మధ్య మధ్యలో కొన్ని ప్రశ్నలేస్తూ ఓ చిన్నసైజు కౌన్సిలింగ్ చేసి– "రిపోర్టులు నార్మల్‌గానే వున్నాయి భయ పడాల్సిన పని లేదు. నీకొచ్చిన జబ్బు పేరు 'సండే ఫోబియా' అనే కొత్తజబ్బు. ఇది ఈ మధ్యనే వస్తుంది కొత్తగా. ఆదివారం వస్తుం దంటే భయపడేవారికిది వస్తుంది.

ఈ జబ్బు శనివారం సాయంత్రం వచ్చి,



సోమవారం ఉదయం వెళ్ళిపోతుంది. ఈ జబ్బుకు మందులు వాడాల్సిన పనిలేదు" అని పకపకా నవ్వాడు డాక్టర్ పశుపతినాథ్.

సండే ఫోబియా అనే కొత్తజబ్బు రావడంతో గుర్నాధానికి భయంగా వుంది. చామంతికేమో వింతగా వుంది. ఆటోలో మళ్ళీ ఇల్లు చేరేసరికి రాత్రి 11 గంటలయ్యింది.

◆ ◆ ◆

"మీకు ఈ కొత్తజబ్బు వచ్చినందులకు భలే సంతోషంగా వుందండీ నాకు. మన కాలనీలో అందరికీ గొప్పగా చెప్పుకోవచ్చు కదండీ" అంది. తెల్లవారి చామంతి నిద్రనుండి లేస్తూనే.

ఈ మాటలకు ఒళ్ళుమండిన గుర్నాథం, కోపంతో పళ్ళు పటపట కొరకబోతుంటే నాలుక పంటిమధ్యలో కరుచుకుపోయి గతుక్కు మన్నాడు.

ఈ జబ్బు తనకే ఎందుకు వచ్చిందో బాగా ఆలోచించసాగాడు. అతనికి జబ్బు రావడానికి గల కారణం ఏంటో స్ఫురణకు వచ్చింది.

"డాక్టర్ చెప్పిన జబ్బు కరెక్టే చామంతీ!" అన్నాడు గుర్నాథం.

"ఎందుకండీ" అడిగింది చామంతి.

"ఈ మధ్యన ఆదివారం వస్తుందంటేనే జడుసుకోవాల్సి వస్తుంది. ప్రతివాడూ చందా వ్రాయమని విరాళం ఇమ్మని...ఏదో పేరు చెప్పి మనింటికి రావడం....డబ్బులు తీసుకుని వెళ్ళడం. గట్టిగా ఇవ్వలేమని చెప్పడానికేమో మనకు మొహమాటం.

ఆదివారం అందరికీ సెలవు కాబట్టి, అందరూ ఇళ్ళల్లోనే వుంటారని, ఆదివారమే వస్తారు చందాలకు వెధవలు" అన్నాడు భార్యతో గుర్నాధం.

"మనమే బ్యాంకులోను, బయట అప్పులతో ఎలాగోలా ఇల్లు కట్టుకున్నాం కష్టపడి. మంచి కాలనీలో ఇల్లుకట్టుకున్నామన్న సంతోషం లేకుండా చేస్తున్నారు వెధవలు. అసలే మీకు జీతం అంతంత మాత్రమే" అక్కసు వెళ్ళ బోసింది చామంతి.

"ఇంటిబ్యాంకులోన్, కిరాణా, పాలు, గ్యాసు, పెట్రోలు, కేబుల్ కనెక్షన్, పిల్లల ఫీజులు, ఆసుపత్రి ఖర్చులు... ఇంకా ఏమి మిగిలిందని జీతంలో..." గుర్నాధం తన బాధ వెళ్లబుచ్చాడు.

"ఒక ఆదివారం షిర్డిసాయిబాబా విగ్రహం ట్రాక్టర్‌లో పెట్టుకుని బాబా పాటలతో ఇంటిం టికీ తిరుగుతూ వచ్చి 500 రూపాయలు తీసుకుని వెళ్ళారు కదండీ. ఆ మహారాష్ట్ర నుండి వచ్చినవారు" గుర్తుచేసింది చామంతి.

"దేవుడు ఇంటిముందుకు వచ్చాడన్న సెంటి మెంట్‌తో ఇవ్వక తప్పిందికాదు' అన్నాడు

గుర్నాథం.


"మరొక ఆదివారం వృద్ధాశ్రమం నడిపిస్తున్నామనీ, పుణ్యం వస్తుందనీ విరాళం వ్రాయమనీ ఒకటే పోరు. చివరకు 500 రూపాయలు వ్రాసి ఇచ్చేవరకు వదల్లేదు. గుర్తుందా చామంతీ" అడిగాడు గుర్నాథం.

నిర్వేదంగా తలూపింది చామంతి.

"మరొక ఆదివారం మన కాలనీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు వచ్చి కాలనీలో మనకు దేవాలయం లేదు. ఎక్కడికో వెళ్ళాల్సి వస్తుంది గుడి కెళ్ళాలంటే. అందుకే కాలనీలోనే గుడికడ్తున్నామని చాలాఖర్చవుతుందనీ, ప్రతి ఇంటికీ 3000 రూపాయలు వ్రాయాలని బలవంతం చేసి, 3000 రూపాయలు విరాళంగా వ్రాసి ఇస్తేగాని ఇల్లుకదలలేదు వాళ్ళు" గుర్తుకు చేసుకుంటూ చెప్పింది చామంతి.

"పోయిన ఆదివారం, యువజన సంఘం వారమనీ, జిమ్‌కు, క్రికెట్ కిట్టుకు విరాళంగా 1000 రూపాయలు తీసుకెళ్ళారు గదూ చామంతీ" అన్నాడు గుర్నాథం ఓపిక తెచ్చుకుంటూ.

"గృహప్రవేశం అయి రెండు నెలలు దాటలేదు. ప్రతి ఆదివారం చందాలు, విరాళాలిమ్మని ప్రాణం తోడేస్తున్నారు. అందుకే నాకీ జబ్బొచ్చిందేమో. వీటినుండి ఎలాగైనా మనం తప్పించుకోవాలి చామంతీ" బాధతో చెప్పాడు గుర్నాథం.



"వచ్చే ఆదివారం వీటిబారినుండి తప్పించుకోడానికి ఓ చక్కని ప్లాన్ వేశానండి. పగలంతా ఇంటికి తాళం వేసి, పార్కుల్లో, తెలిసినవారిండ్లలో గడిపి, చీకటి పడ్డాక మనింటికి వద్దామండీ" హుషారుగా చెప్పింది చామంతి.

"సరే! అలాగే కానిద్దాం" ఏదోలా మొహం పెట్టి బదులిచ్చాడు గుర్నాథం.

◆ ◆ ◆

ఒకరోజు ఆఫీసుకు వెళ్ళిన గుర్నాథం, అర్జంట్‌పని వుందని సగం పూట సెలవు పెట్టి ఇంటికి తిరిగివచ్చిన గుర్నాథాన్ని చూసి చామంతి ఆశ్చర్యపోయింది.

ఇంట్లో మధ్యాహ్నం లంచ్ ముగించి, బయటకు వెళ్ళిపోతున్న గుర్నాథాన్ని "ఎక్కడికి వెళ్తున్నారండి" అని అడిగింది చామంతి.

ముసిముసిగా నవ్వుకుంటూ బదులు చెప్పకుండానే బైక్ స్టార్టుచేసుకుని వెళ్ళిపోయాడు.


ప్రింటింగ్ ప్రెస్‌లు కల బజారులో బైక్ ఆపాడు. కొంచెం రష్ తక్కువగా వున్న ప్రింటింగ్ షాపు కెళ్ళి, "అనాథ బాలలకు ఆర్థిక సహాయంకై విరాళాలు" అని 50 పేజీలు మాత్రమేగల ఒకరశీదు పుస్తకం ప్రింట్ చేయించుకుని ఇంటిముఖం పట్టాడు సంతోషంగా.

తిన్నగా ఇంటికి వస్తూనే, వంటింట్లో వంట చేస్తున్న చామంతిని అమాంతంగా ఎత్తుకుని "యురేకా... యురేకా" అంటూ సంతోషంగా గిరగిరా తిప్పబోయి బ్యాలెన్స్ తప్పి క్రిందపడిపోయాడు గుర్నాథం.

"అయ్యో! దెబ్బలు ఏమీ తగల్లేదుకదా! అయినా ఎందుకండీ అంత సంతోషం? మీకు సంతోషం కల్గినా, బాధ కల్గినా ఆగరు కదా" అని విసుక్కుంది చామంతి.

